


రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6 : 21 (శనివారం సాయంత్రం)
సహర్ : 4:38 (ఆదివారం ఉదయం)

52,173 మంది ఏమయ్యారు!



తొలి విడత ఉచిత సిలిండర్‌కు రెండ్రోజులే గడువు

ఇంకనూ అందుకోని లబ్ధిదారులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మరో రెండు రోజుల్లో తొలివిడత ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ముగియనుంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకంలో తొలి సిలిండర్ ప్రయోజనాన్ని జిల్లాలో ఇంకా 52,173 మంది అందుకోవాల్సి ఉంది.ఈ నెల 31వ తేదీ వరకూ మాత్రమే తొలి ఉచిత సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం ఉంది. దీంతో ఎంతమంది లబ్ధిదారులు వినియోగించుకుంటారనే దానిపై జిల్లా పౌర సరఫరాల అధికారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మిగిలిన వారికి ప్రయోజనం అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.దీనిలో భాగంగా ఆయా ప్రాంతాల్లోని గ్యాస్ డీలర్ల ద్వారా లబ్ధిదారులకు సమాచారం అందజేస్తున్నారు. జిల్లాలో మొత్తం 4,68,010 మంది ఎల్పీజీ లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకూ 4,15,837 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. వారిలో గురువారం నాటికి 4,05,747 మందికి గ్యాస్ డెలివరీ చేశారు.మరో 10,090 మందికి గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయాల్సి ఉంది.ఒకట్రెండు రోజుల్లో వీరికి గ్యాస్‌సిలిండర్ డెలివరీ జరుగుతుందని జిల్లా పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అర్హత కలిగి గ్యాస్ బుక్ చేసుకోని 52,173 మందిలో ఎంతమంది ప్రయోజనాన్ని పొందుతారనేది చూడాల్సి ఉంది.

పంట పండింది!

తూర్పు పంట పండింది..దీంతో రబీ కోతలు ఆరంభమయ్యాయి. జిల్లాలో రాజమండ్రి రూరల్, రాజానగరం,కోరుకొండ, సీతానగరం, రంగంపేట,గోకవరం మండలాల్లో ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభమయ్యాయి.జిల్లాలో 60,042 హెక్టార్లలో వరి ఆయకట్టు ఉండగా రబీలో 58,586 హెక్టార్లలో వరిసాగు చేశారు.రాజమహేంద్రవరం రూరల్‌లో 1299 హెక్టార్లు సాగుచేయగా ఇప్పటికే 700 హెక్టార్లలో కోతలయ్యాయి. ఇది 53.9 శాతం. సీతానగరం మండలంలో 4443 హెక్టార్లలో సాగుచేయగా 800 హెక్టార్లలో కోతలయ్యాయి. ఇది 18శాతం. రాజానగరంలో 3229 హెక్టార్లలో సాగుచేయగా 259 హెక్టార్లలో పూర్తయ్యాయి. ఇది 8 శాతం.కోరుకొండలో 2251 హెక్టార్లలో సాగు చేయగా 320 హెక్టార్లలో కోతలయ్యాయి. 14.2 శాతం. గోకవరం మండలంలో 1989 హెక్టార్లలో సాగు చేయగా 20 హెక్టార్లలో కోశారు. ఇది 1 శాతం. రంగంపేటలో 849 హెక్టార్లలో సాగు చేయగా 83 హెక్టార్లలో కోశారు. ఇది. 9.8 శాతం. చాగల్లులో 3307 హెక్టార్లలో సాగు చేయగా కేవలం 2 హెక్టార్లలో మాత్రమే కోశారు. పెరవలిలో 3305 హెక్టార్లలో సాగు చేయగా 8 హెక్టార్లలో కోశారు. గోపాలపురంలో 2221 హెక్టార్లలో సాగు చేయగా 12 హెక్టార్లలో కోశారు.మిగతా మండలాల్లో ఇంకా కోతలు ఆరంభంకాలేదు.మరో పక్క ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు జిల్లాలో ఎకరాకు 40 నుంచి 50 బస్తాల వరకూ దిగుబడి వస్తుందని తెలిపారు. -(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)





రాజమహేంద్రవరం రూరల్‌లో కోతకు సిద్ధమైన వరిచేను



అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బరుకు కేటాయించిన 200 ఎకరాల మ్యాప్ పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

ఆనంద..తీరం!

మళ్లీ తెర మీదకు 'డ్రెడ్జింగ్' కార్పొరేషన్, యూనివర్సిటీ

- పదేళ్ల కిందట చంద్రబాబు ప్రకటన
- నాడు చొరవ చూపని కేంద్రం
- కనీసం పట్టించుకోని వైసీపీ
- కూటమి రాకతో మళ్లీ వెలుగు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- నేడు కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్
- అంతర్వేదిలో ఆర్డీవో పర్యటన
- 200 ఎకరాల భూముల గుర్తింపు

అంతర్వేది, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబునాయుడు డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను అంతర్వేది తీరంలో ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై అప్పటి ఎంపీగా ఉన్న డాక్టర్ పండుల రవీంద్రబాబు కార్పొరేషన్ ఏర్పాటుకు తన వంతు కృషి చేశారు. అయితే అప్పట్లో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నష్టాల్లో ఉందన్న సాకుతో ఈ ప్రతిపాదనకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. దాంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్, యూనివర్సిటీ ఏర్పాటు కాలేదు. అప్పట్లో కార్పొరేషన్ వస్తుందన్న ప్రచారంతో సముద్రతీర ప్రాంతంలో తక్కువ ధర ఉన్న భూములను సైతం అధిక ధరలకు కొనుగోలు చేసి రిసార్టులు, ఇతర భవనాలు నిర్మించారు. కానీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రతిపాదన గత పదేళ్లలో మరుగున పడిపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ ఊసేలేదు. కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ సీఎం చంద్రబాబు అంతర్వేది తీరంలోనే అనువైన ప్రదేశంగా భావించి అక్కడే డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలనే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. దీనికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సైతం మొగ్గు చూపడంతో మళ్లీ ప్రాజెక్టు అమలుపై జిల్లా ప్రజల్లో ఆశలు చిగురించాయి. దీనిలో భాగంగా శుక్రవారం అమలాపురం ఆర్డీవో కె.మాధవి అంతర్వేది తీరాన్ని పరిశీలించి డ్రెడ్జింగ్ కార్పొరేషన్, యూనివర్సిటీ ఏర్పాటుకు సుమారు 200 ఎకరాల భూమి అవసరంగా భావించి పరిశీలన చేసి ప్రాథమికంగా మార్కింగ్ కూడా ఇచ్చారు. దాంతో ఇప్పుడు మళ్లీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఏర్పాటుపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ కార్పొరేషన్ ద్వారా రాజోలు నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, ఇతర సౌకర్యాలు లభిస్తాయనేది వారి ఆకాంక్ష. ప్రస్తుతం ఆర్డీవో మాధవి తీర ప్రాంత భూముల పరిశీలనతో ఆ ప్రాంతంలో మళ్లీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో హడావుడి నెలకొంది.

చిగురించిన ఆశలు

భూములు పరిశీలించిన ఆర్డీవో..

సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీర ప్రాంతంలో డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్సిటీ కోసం స్థల పరిశీలన చేశామని అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం ఆమె దర్శించుకుని అనంతరం అంతర్వేది నుంచి చింతలమోరి వరకు ఉన్న తీర ప్రాంత భూములను స్థానిక అధికార యంత్రాంగం, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బరు ఏర్పాటుకు 200 ఎకరాల స్థలాన్ని గుర్తించామన్నారు.ఆ భూముల్లో ప్రస్తుతం రూ.1850 కోట్లతో డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్సిటీ ఏర్పాటు చేస్తారన్నారు. ఇప్పటికే సముద్రతీరంలో పెరుగు భూములను పరిశీలించి మార్కింగ్ వేశామని, వాటిని సర్వేచేయించి ఎంత భూమి అవసరం అవుతుందో మ్యాపు ద్వారా పరిశీలించి నివేదిక తయారు చేస్తామన్నారు. తీర ప్రాంత భూముల్లో సరుగుడు, కొబ్బరి వేసి ఉన్న రైతులకు నష్టం కలుగుతుందని రైతులు అమలాపురం ఆర్డీవో కె.మాధవిని అడగ్గా ఆమె రైతులతో మాట్లాడారు. పెరుగు భూమిలోనే సాగు చేసుకుంటున్నారు కదా నష్టపోయేదేమి ఉంది.. ప్రభుత్వం స్వాధీన పరుచుకుని డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్సిటీ ఏర్పాటుచేస్తే అంతర్వేది పరిసరాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రోడ్లు, ఉపాధి కలుగుతుందని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, ఆర్ఐ రామరాజు, సర్వేయర్ భద్రరాజు, పలు సొసైటీల అధ్యక్షులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ పాపాల పుట్ట..
ఈ మెట్ట : ఎటు చూసినా రామేశం మెట్టంతా ఇలా గుల్లగుల్ల చేశారు. (ఫైల్)

రామేశం మెట్టలో.. పాపాల ద్వారం!

గత ఐదేళ్లూ కొండలను మింగేసిన ఘనులు

గత వైసీపీ ఐదేళ్ల పాలనకు పై చిత్రం ఒక నిదర్శనం.. ఉమ్మడి జిల్లాలో చాలా కొండలది ఇదే పరిస్థితి.. కన్నుపడితే చాలు ఖాళీ చేసేశారు.. కొండలను మింగేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.. ఇదెక్కడో మారుమూల కాదు.. పెద్దాపురం రామేశం మెట్ట.. ఏకంగా 823 ఎకరాల్లో ఉన్న కొండ నేడు ఇలా తయారైంది.. గత ఐదేళ్లలో ఈ కొండను గుల్ల చేసి వేల కోట్లు దందా చేశారు.. ఎన్‌జీటీ దృష్టి సారించడంలో పాపాల ద్వారాలు తెరుచుకోనున్నాయి.. అక్రమార్కుల భరతం పట్టే సమయం ఆసన్నమైంది.

\- కాకినాడ/ఆంధ్రజ్యోతి

- నాడు రెచ్చిపోయిన మాఫియా
- అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకం
- 823 ఎకరాలు గుల్లగుల్ల
- లక్షల క్యూబిక్ మీటర్ల తరలింపు
- 19న ఎన్‌జీటీ కోర్టులో కేసు
- కాకినాడ కీలక నేత కనుసన్నల్లో దందా
- రిజర్వు ఫారెస్టు మింగేసిన వైనం
- రూ.250 కోట్ల రాయల్టీ ఆదాయానికి గండి



పెద్దాపురం రామేశ్వరం మెట్ట అక్రమ తవ్వకాలపై అక్రమార్కులకు ఉచ్చు బిగుస్తోంది. ఇన్నేళ్ల పాటు యథేచ్ఛగా 823 ఎకరాల్లో కొండలను గుల్ల చేసి గ్రావెల్ తవ్వుకుపోయి వందల కోట్లు సంపాదించిన నేతలు, అధికారులపై ఎన్‌జీటీ రూపంలో భారీ షాక్ తగలబోతోంది. ఇక్కడ వేల కోట్ల దందాపై చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ దృష్టి సారించింది. దీంతో అక్రమార్కులు, వారికి కొమ్ముకాసిన అధికారులు ఇరుక్కేవడం ఖాయంగా కనిపిస్తోంది.

కొండలు గుల్ల గుల్ల

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, కోనసీమ, యానాం తదితర ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్, రహదారుల నిర్మాణ అవసరాలకు మట్టి, గ్రావెల్‌కు భారీ డిమాండ్ ఉండేది. రామేశం మెట్టలో తవ్విన కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చదును కోసం అమ్మని రియల్ ఎస్టేట్ వెంచర్ లేదు. వేల టిప్పర్ల మట్టి, గ్రావెల్‌ను కాకినాడలోని కీలక వైసీపీ నేత తన అనుచరుల ద్వారా విక్రయించి సంపాదించిన కోట్లకు లెక్కేలేదు. అప్పటి సర్కారులో ముఖ్య నేతకు అతి సన్నిహితమైన వ్యక్తి కావడంతో ఏ ఒక్కరూ కన్నెత్తి చూడలేదు. పేదల ఇళ్ల స్థలాల చదును ముసుగులో అప్పటి తన సామాజిక వర్గ కలెక్టర్ సహకారంతో సదరు కీలక నేత అనుమతులు తీసుకుని ఇక్కడున్న కొండలు, గుట్టలను ఖాళీ చేసి వందల కోట్లకు పడగలెత్తారు. గనులశాఖ అధికారులంతా ఐదేళ్లపాటు అడ్డుకోకపోవడంతో పెద్దపెద్ద కొండలన్నీ కరిగిపోయాయి. 823 ఎకరాల మెట్టంతా మింగేసి సగానికి పైగా భూములను సదరు వైసీపీ అక్రమార్కులు లోయలుగా మార్చేసినా జిల్లా గనుల శాఖ మౌనమే వహించింది. కొన్ని భూములను ప్రభుత్వం స్థానిక ఎస్సీ రైతుల సాగు కోసం అసైన్డ్ భూముల కింద కేటాయించింది. వీటిని ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున చెల్లించి ఇరవై అడుగుల లోతుకు మట్టి, గ్రావెల్ తరలించుకుపోయారు. వందల ఎకరాల అసైన్డ్ భూములను లీజుకు తీసుకుని లోయలుగా మార్చేసినా రెవెన్యూశాఖ సైతం కన్నెత్తి చూడలేదు. ఈ రెండు శాఖలు ఉమ్మడిగా సర్వే చేసి తవ్వి తరలించుకుపోయిన కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి సంగతి తేల్చుతామని ప్రగల్భాలు పలికి సర్వే జోలికి వెళ్లలేదు. కరెంటు స్తంభాలైతే అడుగు నుంచీ గాల్లో వేలాడుతున్నాయి. ఇక్కడ నుంచి తరలిపోయిన కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టికి గనులశాఖకు రూ.250 కోట్లకుపైనే రాయల్టీకి గండిపడింది. అయినా జరిమానా విధించే సాహసం చేయడం లేదు. అక్రమ తవ్వకాలపై స్పందనలో ఫిర్యాదులు చేసినా అవన్నీ బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుతం ఎన్‌జీటీని ఆశ్రయించడంతో కదలిక వచ్చింది.

ప్రత్యేక కమిటీతో దర్యాప్తు చేయండి...

రామేశ్వరం మెట్ట అక్రమాలపై రెండేళ్ల కిందట పెద్దాపురానికి చెందిన ఓ వ్యక్తి లోకాయుక్తను ఆశ్రయించినా నీరుగార్చేశారు. మళ్లీ ఇప్పుడు పెద్దాపురానికి చెందిన కర్రి వెంకట రమణ తాజాగా చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. మెట్టలో వందల కోట్ల అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ చేయించాలని ఆధారాలతో సహా పిటిషన్‌లో కోరారు. దీనిపై స్పందించిన ఎన్‌జీటీ కేసును ఎట్టకేలకు విచారణకు స్వీకరించింది. ఈ మేరకు మార్చి 19న కేసును రిజిస్టర్ చేసింది. దీంతో అక్రమార్కులకు ఉచ్చు బిగుసుకోనుంది. మెట్ట అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమిస్తే వందల కోట్ల కుంభకోణం బట్టబయలు కానుంది. అక్రమార్కుల నుంచి కళ్లప్పగించి చూసిన గనులు, రెవెన్యూ శాఖలు ఇరుక్కోనున్నాయి. మరోపక్క మెట్టలో అసైన్డ్ భూమాఫియా, అటవీ చట్టాల ఉల్లంఘన తదితర అంశాలపైనా పిటిషనర్ ఫిర్యాదు చేయడంతో ఎన్జీటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది. అయితే కాకినాడ నగరంలో పేదల ఇళ్ల స్థలాల పేరుతో మడ భూములను చదును చేసేసిన కేసులో ఇప్పటికే ఎన్జీటీ బాధ్యులైన అధికారులకు చుక్కలు చూపించింది. కోట్లలో జరిమానా కూడా విధించింది. ఈనేపథ్యంలో మెట్ట అక్రమాలపైనా ఎన్‌జీటీ ఉక్కుపాదం మోపాల్సి ఉంది.

823 ఎకరాల్లో.. మింగేశారు!

పెద్దాపురం, గండేపల్లి మండలాల్లో 823 ఎకరాల్లో కొండలు, గుట్టలు విస్తరించి ఉన్నాయి. సర్వే నెంబరు 1 నుంచి 90 వరకు ఉన్న ఈ ప్రాంతాన్ని రామేశ్వరం మెట్టగా పిలుస్తారు. మధ్యలో కొంత ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ కూడా ఉంది. ఇందులో జింకలు, దుప్పిలు, లేళ్ల ఇతర వన్యప్రాణులెన్నో ఉన్నాయి. కాకినాడకు సమీపంలో ఉన్న ఈ కొండలు, గుట్టల్లో నిక్షిప్తమై ఉన్న గ్రావెల్‌పై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ వైసీపీ కీలక నేత ద్వారంపూడి కన్ను పడింది. అంతే రామేశం మెట్టను గుల్ల చేసేశారు. 823 ఎకరాల్లో కొండలను మింగేసి మట్టిగ్రావెల్ కోసం కొండల కింద భూమిని సైతం లోయలుగా మార్చేశారు. అప్పటి కాకినాడ వైసీపీ కీలక నేత ద్వారంపూడి, ఆయన మనుషులు సాగించిన దోపిడీ పర్వం విలువ వందల కోట్లుపైనే. అయితే అప్పట్లో సదరు నేతకు భయపడి కలెక్టర్ నుంచి జేసీ వరకు గనుల శాఖ నుంచి రెవెన్యూ శాఖ వరకు అన్నీ సాగిలపడ్డాయి. ఎంత తవ్వుకున్నా కన్నెత్తి చూడ్డానికి భయపడ్డాయి. ఇప్పుడు ఎన్జీటీ కేసు విచారణకు స్వీకరించడంతో వేల కోట్ల కుంభకోణం బట్టబయలయ్యే అవకాశం కనిపిస్తోంది.

బకాయిలు చెల్లించకపోతే

7 నుంచి వైద్యం బంద్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు సుమారు రూ.3,500 కోట్ల బకాయిలు చెల్లించకపోతే ఏప్రిల్ 7వ తేదీ నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ పథకం వైద్యసేవలను పూర్తిగా నిలిపివేస్తామని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ (ఆషా) ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కురుకూరి విజయకుమార్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అరుణ్ తదితరులు కలెక్టర్ ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఉద్యమ కార్యాచరణలో భాగంగా శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. 30వ తేదీన జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. అప్పటికీ స్పందన లేకపోతే ఏప్రిల్ 7 నుంచి వైద్యసేవలను నిలిపివేయాలని నిర్ణయించామన్నారు.

కుసిమెుసి..

జిల్లా ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఆనందం వ్యక్తం చేసిన ముస్లింలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ఇచ్చే గొప్ప పిలుపు దాతృత్వమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో శుక్రవారం సాయంత్రం జిల్లా స్థాయి ఇఫ్తార్ విందు ఇచ్చారు. తొలుత ముస్లిం పెద్దలు నమాజ్ చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వ పక్షాన కలెక్టర్ ఇఫ్తార్ విం దు ఇచ్చారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ దైవంపై నమ్మకం కలుగచేసే గొప్ప గ్రంథం ఖురాన్ అన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదన్నారు.నగరంలో నెల రోజులుగా ప్రతి మసీదు ఇఫ్తార్‌లో పాల్గొనడం జరిగిందన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ మతం అనేది విశ్వాసం , నమ్మకం అన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ సహనానికి, తోటివారికి తనకున్నదాన్ని పంచడం అనే గొప్పసందేశం ఇచ్చే రంజాన్ మాసం స్ఫూర్తి కలిగిస్తోందన్నారు. ఎస్పీ నరసింహకిశో ర్ మాట్లాడుతూ అజ్మీర్ దర్గా వద్ద జరిగే కార్యక్రమంలో సుమారు 70 నుంచి 80 వేల మంది పాల్గొన్నా ఒక్క కానిస్టేబుల్ కూడా లేకుండా క్రమశిక్షణ కలిగిన తీరును ప్రదర్శించడం ఎంతో స్ఫూర్తి ఇచ్చిందన్నారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందును స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో టి.సీతారామమూర్తి, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్,ఎండీ అబ్దుల్లా, ఎస్‌కె.అమీర్‌రాజా, బషీర్ భాయ్, మహబూబ్ ఖాన్, మహబూబ్ జానీ, బాషా ఖాన్, జానీ భాయ్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ,నగర అధ్యక్షుడు వై.శ్రీను, నక్క చిట్టిబాబు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి చిత్రంలో ఎస్పీ నరసింహకిశోర్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ

ఐదు ఏఎంసీలకు ఛైర్మన్లు

కాకినాడ/అమలాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ల జాబితాలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సంబంధించిన ఛైర్మన్లు చోటుదక్కించుకున్నారు. ఇందులో రెండు టీడీపీకి, మూడు జనసేనకు దక్కాయి. పిఠాపురం ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా వాకపల్లి దేవి (జనసేన) నియమితులయ్యారు. ఈమె ఎస్సీ మహిళ కేటగిరీ నుంచి ఎంపికైంది. కాకినాడ రూరల్‌లోని కరప ఏఎంసీ ఛైర్మన్‌గా ముద్రగడ రమేష్ (జనసేన), కాకినాడ జిల్లా జగ్గంపేట ఏఎంసీ ఛైర్మన్‌గా అడపా భరత్‌బాబు (టీడీపీ) నియమితులయ్యారు.కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పరిధిలో నగరం ఏఎంసీ ఛైర్మన్‌గా పెనుమాల లక్ష్మి (జనసేన),మండపేట ఏఎంసీ ఛైర్మన్‌గా చింతపల్లి రామకృష్ణ (టీడీపీ) నియమితులయ్యారు.తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎవ రినీ ప్రకటించలేదు.

'పని'లో పనిగా...



ఏ ఎండకు ఆ గొడుగు అంటే ఇదేనేమో... ఎండలు రోజురోజుకీ ముదురుతున్నాయి... సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు.... అలాగని బయటకి రావడం తప్పదు కదా... ఓ పనికోసం బైక్‌పై రేకు తీసుకెళ్తున్న వీరిద్దరూ ఎండ నుంచి కాపాడకోవడానికి దానినే అడ్డుపెట్టుకున్నారు. రాజమహేంద్రవరం ఆర్టీవో ఆఫీసు సమీపంలో శుక్రవారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

పట్టు తప్పిందా... ప్రాణం గోవిందా!



కొంతమంది ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రమాదాలకు కారణాలవుతున్నారు. కొందరు ఆటోలో నిల్చుని, మరికొంతమంది వెనుక పల్చని ఇనప రేకుపై కూర్చుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఏ మాత్రం పట్టుతప్పినా ప్రాణాలు కోల్పోవాల్సిందే. కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి జాతీయ రహదారిపై ఇలాంటి ప్రయాణాలు నిత్యకృత్యం. రవాణా, పోలీసు అధికారులు ఇటు చూడండోసారి...

శంఖవరం (ఆంధ్రజ్యోతి)

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

రాజానగరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో పీఎం అజయ్ పథకంలో భాగంగా నిరుద్యోగులకు నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ బొమ్మూరులో నైపుణ్య శిక్షణ ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 150 మందికి లక్ష్యంగా, ఎస్సీ కులాలకు చెందిన పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, అసిస్టెంట్ హెయిర్ స్టైలిస్ట్, డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్ కేటగిరిల్లో నైపుణ్య శిక్షణ కల్పిస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్లేస్‌మెంట్స్ ఏర్పాటు చేస్తారన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు లేదా నేరుగా మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో మూడు రోజులలోగా వివరాలు నమోదు చేసుకోవాని ఎంపీడీవో ఝాన్సీ పేర్కొన్నారు.

కాండ్రకోట నూకాలమ్మ జాతర ప్రారంభం



పెద్దాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోటలో కొలువై భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు తీర్చుకున్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్దాపురం ఎస్‌ఐ మౌనిక ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కోలాటం, గరగల నృత్యం, మ్యుజికల్ నైట్, దేవతామూర్తుల వేషధారణ, కాళిక వేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

2 నుంచి పీజీ సెట్ మేథమెటిక్స్‌లో ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి పీజీ సెట్-2025కు మేథమెటిక్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, హెచ్‌వోడీ జి.చంద్రశేఖర్ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ మేథమెటిక్స్‌లో శిక్షణ ఉంటుందని, సిలబస్‌లో ముఖ్యమైన టాపిక్స్‌పై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఉచిత శిక్షణకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల కోసం 94416 86669, 94916 92923 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్, హెచ్‌వోడీ పేర్కొన్నారు.

ఆస్ట్రేలియా వర్సిటీతో జేఎన్టీయూకే ఎంవోయూ



పత్రాలను మార్చుకుంటున్న వీసీ ప్రసాద్, ఒనిన్స్కి

జేఎన్టీయూకే, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని యూనివర్శిటీ ఆఫ్ న్యూకాజిల్ తో కాకినాడ జేఎన్టీయూ అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు సంబంధించిన అంశాలపై సమావేశం నిర్వహించారు. వీసీ సమావేశ హాల్లో ఎంవోయూపై ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, యూనివర్శిటీ ఆఫ్ న్యూకాజిల్ ప్రో వీసీ డాక్టర్ అలెగ్జాండర్ ఒనిన్స్కితో శుక్రవారం చర్చించారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ టెక్నాలజీ, ఇంజనీరింగ్,మేనేజ్‌మెంట్ విభాగాల్లో విద్యార్థులకు యూజీ, పీజీ కోర్సులను అందిస్తుందన్నారు. ఒనిన్స్కి మాట్లాడుతూ క్యూఎస్ ప్రపంచ ర్యాంకింగ్‌లో తమ యూనివర్శిటీలోని విభాగాలు ఉత్తమర్యాంకులు కలిగి ఉన్నాయన్నారు. 92శాతం మంది విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఎంవోయూకు సుముఖత వ్యక్తంచేశారు.ఎఫ్‌యూఆర్ డైరెక్టర్ స్వర్ణకుమారి, రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, మాజీ వీసీ ప్రసాదరాజు, డైరెక్టర్లు బాలకృష్ణ, గోపాలకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్షీణిస్తున్న అంజలి ఆరోగ్యం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఐసీయూలో చికిత్సపొందుతున్న ఫార్మడి ఫైనలియర్ విద్యార్థిని ఎన్.నాగాంజలి ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోంది. ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. దీపక్ తనను మోసం చేశాడనే మనస్తాపంతో అంజలి ఈ నెల 23న మత్తు ఇంజక్షన్ అత్యధిక మోతాదులో తీసుకుని అపస్మారక స్థితికి చేరుకుంది. ఆరు రోజులుగా ఆమె పరిస్థితి విషమంగా ఉంది. శుక్రవారం కూడా ఎటువంటి మార్పు కనిపించలేదని సమాచారం.

ఎండల్లో హాయ్... హాయ్...



చల్లదనాన్ని ఆస్వాదిస్తూ ప్రయాణం...

- గాలిలో నాణ్యత పెంపునకు మిషన్
- రాజమహేంద్రవరంలోని రద్దీ ప్రాంతాల్లో వినియోగం
- నగర ప్రజలను ఆకర్షిస్తున్న వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ మిషన్



లాలాచెరువు హైవేలో నీటిని స్ప్రే చేస్తున్న మిస్టింగ్ మిషన్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గాలిలో నాణ్యతను పెంపొందించే వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనాన్ని రాజమహేంద్రవరం వీధుల్లో తిప్పుతున్నారు. ఇది వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు ఆయా ప్రాంతాలను చల్లబరుస్తుంది. వాహనాలు, పేపరుమిల్లు వాయు కాలుష్యంతో నగర ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చే పరిస్థితి లేదు. దీంతో గాలిలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనాన్ని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ రూ.47.79 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసింది. దీనిని ఇప్పుడు నగరంలో తిప్పుతున్నారు. ఈ వాహనం వెళ్తున్న క్రమంలో వాటర్ ఆవిరి రూపంలో గాలిలోకి స్ప్రే అవుతుది. దీంతో కాలుష్య నియంత్రణ జరుగుతోంది. అంతేగాక అధిక ఉష్ణోగ్రతలతో వేడెక్కిన ఆ ప్రాంతం ఒక్కసారిగా చల్లబడి ప్రజలు, వాహనచోదకులు సేదదీరుతున్నారు. వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్‌ను వాహనాన్ని నగరంలో నిత్యం రద్దీగా



వుండే దేవీచౌక్, జైలు రోడ్డు, కోరుకొండ రోడ్డు, కంబాలచెరువు, గోకవరం బస్టాండ్, పుష్కరాల రేవు, గెయిల్ ఆఫీస్ రోడ్డు, ఏవీఏ రోడ్డు, దానవాయిపేట, ప్రకాష్‌నగర్, జేఎన్ రోడ్డుల్లో తిప్పుతున్నారు. వాహనం వెళ్లిన 15 నిమిషాల వరకు ఆ ప్రాంతమంతా చల్లగా ఉంటోంది. మండిపోతున్న ఎండల్లో వాహనచోదకులు, బాటసారులకు కాస్త చల్లదనం పంచుతోంది. ప్రతిరోజు మధ్యాహ్నం పూట ఈ వాహనం నీటిని స్ప్రేయింగ్ చేస్తూ నాణ్యమైన గాలితో పాటు చల్లదనాన్ని అందిస్తోంది.

8వేల లీటర్ల నీటితో గాలిలో స్ప్రేయింగ్

వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనం ద్వారా మంచినీటిని గాలిలోకి చల్లడంతో కాలుష్యం తగ్గుతుంది. ఈ వాహనంలో వినియోగించే నీటిలో క్లోరిన్ తక్కువగా వేసి శుద్ధి చేసిన 8వేల లీటర్లను నింపుతారు. రోజుకు రెండున్నర గంటల పాటు 9.5 కిలోమీటర్ల మేర తిరిగి నీటిని గాలిలో స్ప్రే చేస్తుంది. దీంతో గాలిలోని దుమ్ము, విసర్జిత పదార్థాలు తగ్గుతాయి. కాలుష్య ప్రాంతాలను గుర్తించి అక్కడ వాహనం ద్వారా నీటిని వెదజల్లేందుకు షెడ్యూల్ తయారు చేశారు. ఈ వాహనంలో డ్రైవర్, ఆపరేటర్ ఉంటారు.



దాట్ల దేవదానం రాజుకు కళారత్న పురస్కారం

యానాం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కళారత్న(హంస) పురస్కారం అందజేస్తున్నట్టు సాంస్కృతికశాఖ డైరెక్టర్, కన్వీనర్ ఆర్.మల్లికార్జునరావు నుంచి సమాచారం అందిందని యానానికి చెందిన ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు తెలిపారు. ఉగాది సందర్భంగా ఆదివారం జరిగే ప్రత్యేక సభలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా తమ్ములపల్లి కళాక్షేత్రంలో అందజేయనున్నారు. కథకుడిగా, కవిగా, విమర్శకుడిగా, చరిత్రకారునిగా సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న రాజు పురస్కారం స్వీకరిస్తున్నందుకు కవిసంధ్య అధ్యక్షుడు శిఖామణి తదితరులు అభినందనలు తెలిపారు.

డాక్టర్ విష్ణువర్ధన్‌కు అదనపు డీఎంఈగా పదోన్నతి



జీజీహెచ్ (కాకినాడ), మార్చి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అదనపు డీఎంఈగా పదోన్నతి పొందారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయించనున్నారు.

నోటిఫికేషన్ రద్దు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది డిసెంబరు 30న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ పరిధిలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2, ఎఫ్ఎన్‌వో, శానిటరీ అటెండర్ కం వాచ్‌మెన్ పోస్టులు ఉన్నాయన్నారు. నోటిఫికేషన్ రద్దు నేపథ్యంలో దరఖాస్తుదారులకు డీడీలు తిరిగి ఇవ్వాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయించినట్టు తెలిపారు. కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో వచ్చే నెల 26వరకు డీడీలు తిరిగి ఇస్తామన్నారు. డీడీల కోసం వచ్చే దరఖాస్తుదారులు తమ ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ నకళ్లు అందించాలని, అప్లికేషన్ నెంబర్ చెప్పాలని తెలిపారు. పోస్టుల రేషనలైజేషన్‌లో భాగంగా నోటిఫికేషన్ రద్దు చేసినట్టు డీఎంహెచ్‌వో చెప్పారు.

గిరిజన విద్యార్థినికి గర్భ నిర్ధారణ పరీక్షలు?

అడ్డతీగల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ఒక పాఠశాలలో అభ్యసిస్తున్న గిరిజన బాలిక గర్భం దాల్చినట్లు విశ్వసనీయ సమాచారం. అల్లూరి జిల్లా అడ్డతీగలలో జరిగిన ఈ సంఘటనపై రంపచోడవరం ఉన్నతాధికారి ఒకరికి ఈ సమాచారం అందడంతో నిజానిజాలు నిర్ధారించడానికి గంగవరం మండలానికి చెందిన మండల స్థాయి అధికారిణిని అడ్డతీగల వెళ్లి సదరు గిరిజన బాలికకు వైద్య పరీక్షలు చేయించి తమకు నివేదిక పంపించాలని ఆదేశించినట్లు సమాచారం. ఆ విద్యార్థినికి అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సమాచారం. ఈ విషయాన్ని అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. ఈ అంశంపై రంపచోడవరం గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య ఈ వదంతులను ఖండించారు.

భక్తులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- వాడపల్లి వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన
- ఫ్లైఓవర్, లైన్లు ప్రారంభం



ఫ్లైఓవర్, లైన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి తరలివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆలయంలో వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఫ్లైఓవర్, క్యూలైన్లను ఆయన ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టిసారించామన్నారు. కూటమి ప్రభుత్వం మాస్టర్ ప్రణాళికలను రూపొందించిందని అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. అనంతరం లైన్లు, మరుగుదొడ్ల నిర్మాణం తదితర పనులను పరిశీలించి ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావుకు పలు సూచనలు చేశారు. కోనేరు, అన్నదాన భవన నిర్మాణ పనులు ఆయన పరిశీలించారు. తొలుతగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆక్రమణలు తొలగించే విషయంలో కొంతమంది వ్యాపారులు, గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి తమ బాధను తెలిపారు. అనంతరం వారందరితో ఆయన చర్చించారు. కార్యక్రమంలో నాయకులు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, యేపుగంటి వెంకటేష్, అల్లు భాస్కరరావు, ఎంవీవీ సత్యనారాయణ, పిండెం వెంకన్న పాల్గొన్నారు.

ఏర్పాట్లపై చర్చించిన ఆర్డీవో

ప్రతి శనివారం వాడపల్లి వెంకన్న ఆలయానికి వచ్చే భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను ఆర్డీవో పి.శ్రీకర్ శుక్రవారం పరిశీలించారు. ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావుతో ఆయన చర్చించారు. లైన్ల విస్తరణ పనులను పరిశీలించారు. ఏప్రిల్ 7 నుంచి జరిగే స్వామివారి కల్యాణోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన చర్చించారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌తోపాటు ఆర్డీవో సమీక్ష చేశారు. మరో విడత వివిధ శాఖల అధికారులతో సమీక్షించనున్నారు. ఆర్డీవో వెంట తహశీల్దారు శ్రీధర్, ఎంపీడీవో రామన్, ఎస్‌ఐ రాము ఉన్నారు.

నూకాంబిక జాతర ఉత్సవాలు





కాగడాలు వేస్తున్న భక్తులు, నూకాంబికా అమ్మవారు

ఆలమూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలో పేరుగాంచిన అమ్మవారి జాతరలలో ఒకటైన ఆలమూరు మండలం చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. అమ్మవారికి చంటి పిల్లల చేత కాగడాలు వేయించడంతోపాటు తుళ్ల బిళ్ల, వారపోయుట, కావిడికోళ్ల మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి తెలిపారు. జాతరలో రంగురంగుల విద్యుత్ కాంతులు ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలు నిర్వహణ కోసం వివిధ శాఖ అధికారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి ఆయాశాఖల అధికారులు ఉత్సవ ఏర్పాట్లు తహశీల్దార్ ప్రకాష్‌బాబు పర్యవేక్షించారు. పారిశుధ్య ఏర్పాట్లపై ఎంపీడీవో ఎ.రాజు ప్రత్యేక సిబ్బంది నియమించారు. జాతర ఉత్సవాలు సజావుగా జరిగేందుకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ పర్యవేక్షణలో ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ దాదాపు మూడు వందల మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఉగాది నాటిక పోటీలకు ఏర్పాట్లు పూర్తి

సీఆర్సీ అధ్యక్షుడు నాగమోహనరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగమోహన్‌రెడ్డి

రావులపాలెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీలో సీఆర్సీ కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో 25వ ఉగాది ఆహ్వాన నాటక పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి తెలిపారు. రావులపాలెం సీఆర్సీ మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఆర్సీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు 31, ఏప్రిల్ 1న నాటికలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. నాటిక పోటీలకు న్యాయనిర్ణేతలుగా సిని రచయిత, సీఆర్సీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ తనికెళ్ళ భరణి ఆధ్వర్యంలో, డాక్టర్ కోట శంకరరావు, డాక్టర్ గౌతంరాజు, గుండు సుదర్శన్‌తో పాటు పలువురు వ్యవహరిస్తున్నారన్నారు. నాటక కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రేక్షకులు పెద్దఎత్తున తరలివచ్చి నాటిక పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 30వ తేదీన ముందుగా శ్రీవిశ్వావసునామ సంవత్సర ఉగాది వేడుకలు, బ్రహ్మశ్రీ పెదసనగంటి సీతారామమూర్తి శర్మఅవధానిచే పంచాంగ శ్రవణం అలాగే పశ్చిమగోదావరి జిల్లా పెద్వేంకు చెందిన శుక్ల యజుర్వేద తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు ఆరాధ్యుల అప్పనసోమయాజికి వేదపండిత సత్కారం నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా మేకప్ ఆర్టిస్ట్ అడివి శంకరరావుకు డాక్టర్ తనికెళ్ళ భరణి కాటన్ కళా పురస్కారాన్ని అందజేస్తారన్నారు.

మన ప్రాజెక్టులకు సీఎం ఓకే

- యాక్షన్ ప్లాన్ ప్రకారం లక్ష్యాలు సాధించాలి
- జిల్లా అధికార్లకు 'తూర్పు' కలెక్టర్ ప్రశాంతి దిశానిర్దేశం

రాజమహేంద్రవరం, మార్చి28(ఆంధ్రజ్యోతి): విజన్-2047 లక్ష్య సాధన కోసం మనం జిల్లాలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు సీఎం చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఇక మనం నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి మండల స్థాయిలో ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయడానికి సిద్ధం కావాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి దిశానిర్దేశం చేశారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె ఇటీవల అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తీసుకున్న నిర్ణయాలను కలెక్టర్ వివరించారు. వ్యవసాయ, హార్టీకల్చర్, పశుసంవర్థక, మత్స్యశాఖ, అధికారులు జీవీఏ వృద్ధి రేటు పెంచేలా తయారు చేసిన నివేదికలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. దీని కోసం క్షేత్రస్థాయిలో ప్రణాళికలను ఆచరించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు పెంచేదిశలో పంటల మార్పిడి, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలసాగు, పొలాల గట్లపై అంతర పంటలు, పశువుల దాణా, గడ్డి సాగువంటివాటిపై దృష్టి పెట్టాలన్నారు. మెరుగైన అధిక దిగుబడులను సాధించేలా పంటకు అవసరమైన వత్తనాల పంపిణీ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు చేపట్టాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో దశల వారీగా పంట మార్పిడి విధానాలు అమలు చేయాలన్నారు. హార్టికల్చర్, పశుసంవర్థక, మత్స్యశాఖ రంగంలో కూడా ఆవిష్కరణలు ఎక్కువగా ఉండాలని ఆదేశించారు. 100శాతం సాగుభూమిని వినియోగంలో తేవాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ ఏడాది 15శాతం వృద్ధి రేటు సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే 2025-26 ఆర్థిక సంవత్సరానికి యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశామని, వాటిని మండలాల వారీ అమలు చేయాలని ప్రశాంతి చెప్పారు. వ్యవసాయంలో 17.57శాతం, హార్టీకల్చర్‌లో 16.33శాతం, పశుసంవర్థక శాఖలో 19.76శాతం కలిపి వ్యవసాయ అనుబంధ రంగాల్లో 40.62శాతం వృద్ధిరేటు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇండస్ట్రీ అనుబంధ రంగాల్లో 18.01శాతం, పర్యాటక, సేవ,రియల్ ఎస్టేట్, రవాణా రంగాల్లో 41.37శాతం వృద్ధిరేటు సాధించేలా అడుగులు వేస్తున్నట్టు చెప్పారు.

సత్యదేవుని హుండీల ఆదాయం

రూ.1.19 కోట్లు


హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1,19,10,887 నగదు, 25 గ్రాముల బంగారం, 512 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యూఎస్ఏకు చెందిన 46 డాలర్లు, మలేషియా 15, ఆస్ట్రేలియా 20, యూఏఈ 105 దిరహమ్స్ లభించాయి. 25 రోజులకు ఈ ఆదాయం సమకూరగా సరాసరిన రోజుకు రూ.4.76 లక్షలు భక్తులు హుండీల్లో కానుకల రూపంలో సమర్పించుకున్నారు. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు పర్యవేక్షించగా సిబ్బంది,సేవాసంస్థ సభ్యులు లెక్కించారు.

పట్టువస్త్రాలు సమర్పణ


పట్టువస్త్రాలు అందిస్తున్న లక్ష్మీశోరాం అధినేతలు

విశ్వావసు నామ ఉగాది పర్వదినం పురస్కరించుకుని విశాఖపట్నం లక్ష్మీశోరాం ప్రతినిధులు శ్రీనివాసరావు, దత్తయ్యలు శుక్రవారం రత్నగిరిపై స్వామి,అమ్మవార్లకు, ఉపాలయాలలో ఉన్న సీతారాములు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. వాటిని ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌కు అందజేశారు. కార్యక్రమంలో అన్నవరం వావిలీ అర్చకస్వామి నిత్యాన్నసత్ర సమాజం అధ్యక్షుడు పేరూరి గాంధీ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి...

అన్నవరం ఆలయ క్షేత్రపాలకులైన సీతారాముల దివ్యకల్యాణ మహోత్సవాల సందర్భంగా విశాఖపట్నంకు చెందిన మల్లెల వీరరాఘవరావు, దువ్వ గ్రామానికి చెందిన కాశీ పట్టువస్త్రాలను దేవస్థానం అధికారులకు అందించగా దాతలను ఆలయ అభినందించారు.

రూ.10 లక్షల విరాళం


రూ.10లక్షల విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన శివసదన్ కాటేజీకి శుక్రవారం ఒక దాత రూ.10 లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా పేరు చెప్పడానికి ఇష్టపడని రాజమండ్రికి చెందిన దాతను ఈవో అభినందించారు.

అమ్మానాన్నలు మందలించారని

ఆరుగురు విద్యార్థుల అదృశ్యం


విద్యార్థులు పృథ్వీవర్మ, కరుణ, పండు, సంతోష్, సతీష్, మాధురి

- ఆలమూరులో వెలుగులోకి వచ్చిన ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

ఆలమూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్కూలుకు సక్రమంగా వెళ్లడం లేదని తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ఆరుగురు విద్యార్థులు అదృశ్యమైన సంఘటన ఆలమూరులో వెలుగులోకి వచ్చింది. డా.బీఆర్అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని యానాదులపేటకు చెందిన విద్యార్థులైన నలుగురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ఈనెల 24న రాత్రి ఏడుగంటల సమయంలో ఇంటి నుంచి పరారయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టి ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలమూరు యానాదులపేటలో కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగించే ఐదు కుటుంబాలకు చెందిన కొమరగిరి పృథ్వీవర్మ (12) 6వ తరగతి, కొమరగిరి కరుణ(14) 8వ తరగతి, గండం సత్యనారాయణ(13) 8వ తరగతి, మరి సంతోష్(14) 7వ తరగతి, కొమరగిరి పండు (12) 6వ తరగతి, రామచంద్రపురానికి చెందిన కొమరగిరి మాధురి(12) 7వ తరగతి చదువుతున్నారు. కొమరగిరి కరుణ ఆలమూరు బొబ్బా జయశ్రీ గర్ల్స్ హైస్కూల్‌లో చదువుతుండగా పృథ్వీవర్మ, సత్యనారాయణ, సంతోష్, పండులు కొత్తూరు సెంటర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. మధురి రామచంద్రపురంలో చదువుతుండగా 4రోజుల క్రితం ఆలమూరుకు తన చిన్నమ్మ ఇంటికి వచ్చింది. ఈ ఆరుగురు ఈనెల 24న రాత్రి 7గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లినవారు తిరిగి వినాయక గుడి సెంటర్ నుంచి వెళ్లినట్టు పోలీసులు సేకరించిన సమాచారం మేరకు తెలుస్తుంది.

ఒకే కాలనీ వాసులు

అదృశ్యమైనవారంతాఆలమూరులోని యానాదులపేటకు చెందినవారు. ఇక్కడ దాదాపు 50 కుటుంబాలు కూలీపనులు, చేపలవేట తదితర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. పిల్లలను స్కూల్‌కు పంపించి తల్లిదండ్రులు పనులకు వెళ్లడం జరుగుతుంది. అయితే వారి పై నిర్లక్ష్యం ఆజమాయిషీ లేకపోవడంతో స్కూల్‌కు వెళ్లడం లేదు. దీంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో వారిని మందలించడం జరిగింది. దీంతో అలిగి ఇంటి నుంచి పరారైనట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తల్లిదండ్రులు వివరించారు.

ఆచూకీ కోసం ప్రత్యేక బృందం

ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేశారు. సీఐ ఆదేశాల మేరకు ఆలమూరు ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలను సేకరించే చర్యలు చేపట్టారు.

కర్రతో కొట్టి.. ఎండలో మోకాలి కుర్చీ వేయించి!

- విద్యార్థినిపై హిందీ టీచరు దాష్టీకం
- సామ్మసిల్లి ఆసుపత్రిలో చేరిన వైనం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేశ్వరి

సామర్లకోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ పరిధి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.మహేశ్వరి చేతులపై హిందీ టీచరు బారలెక్కే తీవ్రంగా కర్రతో కొట్టడమే గాక ఆరుబయట ఎండలో మోకాలి కుర్చీ వేయించడంతో బాలిక సొమ్మసిల్లి పడిపోగా సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం సాయంత్రం చేర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పదోతరగతి పరీక్షల పేపర్లు అప్పగించేందుకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. తల్లిదండ్రులు కొప్పిరెడ్ల సత్యనారాయణ సాయంతో బాలికను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలిక కోలుకుంటున్నట్టు వైద్యులు తెలిపారు.

అవినీతి.. 'లక్ష'ణాలు!

మొన్న పిఠాపురం రూరల్ ఎస్ఐ.. నేడు కాకినాడ జిల్లా సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్.. వరుసగా అవినీతి ముసుగు వేసుకున్న లంచావతారాల గుట్టు బయటపడడం కాకినాడ జిల్లాలో సంచలనమైంది.

- కాకినాడలో ఏసీబీకి చిక్కిన జిల్లా రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్..
- గ్యాస్ ఏజెన్సీ యజమాని పేరు మార్పునకు రూ.లక్ష డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన ఏజెన్సీ యజమాని
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- ఇటీవల ఏసీబీకి చిక్కిన పిఠాపురం రూరల్ ఎస్ఐ


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, నగదు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మొన్నటికి మొన్న ఏసీబీ వలకు పోలీసు అవినీతి తిమింగలం చిక్కింది. తాను ప్రైవేటుగా పెట్టుకున్న డ్రైవర్ ద్వారా రూ.20 వేలు లంచంగా తీసుకుంటూ కాకినాడ జిల్లా పిఠాపురం రూరల్ ఎస్ఐ ఎల్.గుణశేఖర్ ఈ నెల 24న తేదీ రాత్రి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన జరిగిన నాలుగు రోజులకే మరో భారీ అవినీతి తిమింగలం కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల వలకు పట్టుబడింది. కాకినాడ జిల్లాలో నాలుగు రోజుల వ్యవధిలో జరిగిన ఈ వరుస ఘటనలు కలకలం రేపుతున్నాయి. అవినీతి సొమ్ముకు అలవాటు పడిన కొందరు అధికారులు లంచాలు డిమాండ్ చేస్తూ ఏసీబీ అధికారులకు వరుసగా పట్టుబడడం సంచలనమైంది.

భారీ అవినీతి తిమింగలం..

కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ అంటేనే ఆదాయం భారీగా ఉంటుంది. జిల్లా కేంద్రం కావడంతో ఇక్కడికి వివిధ పనుల నిమిత్తం క్రయవిక్రయదారులు అధికంగా వస్తుంటారు. జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు, సబ్ రిజిస్ట్రార్‌లు ఇక్కడ విధులు నిర్వర్తిస్తుంటారు. ఇక్కడ డాక్యుమెంట్ రైటర్లు కూడా ఎక్కువే. నిత్యం వీరంతా కార్యాలయంలోనే నేరుగా తమ పనులు చక్కబెట్టుకుంటారు. మరోవైపు సిబ్బంది కూడా చాలామంది ఏళ్ల తరబడి ఇక్కడే తిష్టవేశారు. అవినీతికి అలవాటు పడ్డారు. రోజువారీ టార్గెట్లు పెట్టుకుని చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఇక జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు విషయానికి వస్తే.. ఈయన సొసైటీ, పర్స్, ఎడిట్ ఇండెక్స్(తప్పుల సవరణ, పోస్టు ఫ్యాక్ట్ పనులు, పవర్ వాల్యూషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తనిఖీ ఈయన పని.. జిల్లాలోనే ఆయన గత కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆడిట్ అండ్ మార్కెట్ రిజిస్ట్రార్‌గా రెండేళ్లపాటు కాకినాడలో పనిచేశారు. అనంతరం ఇక్కడి నుంచి బదిలీపై రాజమండ్రి వెళ్లిపోయారు.. 2024 ఆగస్టులో బదిలీపై తిరిగి కాకినాడ వచ్చారు.

రూ.లక్ష డిమాండ్ చేసిన రిజిస్ట్రార్..

తన భార్య పేరున ఉన్న గ్యాస్ ఏజెన్సీని తన పేరుపై మార్చుకునేందుకు ...

కారులో నగదు, ఖరీదైన మద్యం సీసాలు, స్వాధీనం

ఏసీబీకి పట్టుబడిన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావును ఏసీబీ అధికారులు శుక్రవారం రాత్రి విచారించారు. ఆయన కారులో సుమారు రూ.7.80లక్షల నగదు, ఖరీదైన 13 మద్యం సీసాలను గుర్తించారు. వీటిని కాకినాడ ఇంద్రపాలెంలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. ఆనందరావు పై అనేక అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయనకు విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరంలలో భారీ భవంతులు ఉన్నట్టు సమాచారం.

పేరున పార్టనర్ షిప్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయాలంటూ వచ్చిన తునికి చెందిన ఆర్‌.రమేష్‌బాబు నుంచి రూ.లక్ష డిమాండ్ చేసిన ఏసీబీ అధికారులకు చిక్కారు కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు. ఆయనతో పాటు మరో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్యుమెంట్ రైటర్ వెలుగుల జగదీశ్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. తునికి చెందిన ఆర్‌.రమేష్‌బాబు తన భార్య పేరున ఉన్న సమతా గ్యాస్ ఏజెన్సీని కొన్ని కారణాలతో తన పేరున మార్చుకోవాలని, పార్ట్‌నర్‌షిప్ డీడ్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకుగాను జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావును ఆశ్రయించారు. ఆ పని చేయాలంటే రూ.లక్ష ఇవ్వాలని ఆనందరావు డిమాండ్ చేశారు. 15 రోజులుగా ఈ వ్యవహారం సాగుతుండగా రమేష్‌బాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన రమేష్‌బాబు లంచం సొమ్మును ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఆనందరావు నుంచి రూ.లక్ష, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి నుంచి రూ.25 వేలు, ఆనధికారికంగా ఉన్న మరో రూ.85వేల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మధ్యవర్తిగా వ్యవహరించిన డాక్యుమెంట్ రైటర్ వెలుగుల జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తున్నట్టు ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌బాబు తెలిపారు.

డిప్యూటీ సీఎం ఇలాకాలో...

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం మండలం దొంతమూరు గ్రామానికి చెందిన కిల్లాడ దుర్గాప్రసాద్, సానబోయిన గంగరాజు నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటూ రూరల్ ఎస్ఐ గుణశేఖర్, అతడి పోలీసు వాహనంపై ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్న శివ ఏసీబీ అధికారులకు చిక్కారు. 2024 అక్టోబర్ నెలలో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసులో జిల్లా స్థాయి అధికారుల విచారణ అనంతరం పిఠాపురం మండలం వి.దొంతమూరు గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, గంగరాజులను నిర్దోషులుగా గుర్తించారు. వారి పేర్లను కేసు నుంచి తొలగించేందుకు రూరల్ ఎస్ఐ గుణశేఖర్ లంచం డిమాండ్ చేసి 20 రోజులుగా తిప్పుతున్నారు. బేరసారాల అనంతరం రూ.20 వేలకు అంగీకారం తెలిపి.. ఆ సొమ్ము తీసుకుంటుండగా గుణశేఖర్‌ను ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. డిప్యూటీ సీఎం ఇలాకాలో జరిగిన ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. అయితే దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించారు. ప్రజలను ఇబ్బంది పెట్టే నేరస్తులతో పాటు వారికి అండగా ఉండే నాయకులు, పోలీసులను ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో శాంతి భద్రతల అంశంపై అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు పోలీసు స్టేషన్లలో పరిస్థితిపై ఇంటలిజెన్స్ నివేదిక తీసుకోవాలని ఆదేశించారు.

పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష తేదీ మార్పు

ముమ్మిడివరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మార్చి 31న జరగాల్సిన పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష తేదీ మార్పు చేసినట్టు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా శుక్రవారం తెలిపారు. 31 వ తేదీన రంజాన్ సెలవు దినం కావడం వల్ల ఆ రోజు జరగాల్సిన పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష ఏప్రిల్ 1వ తేదీకి మార్పు చేసినట్టు తెలిపారు. పరీక్షా తేదీ మార్పు ను పరీక్షా సిబ్బంది, అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గమనించి విద్యార్థులకు తెలియచేయాల్సిందిగా సూచించారు.

ఆగిన అంతిమయాత్ర!

- బాణసంచా పేల్చడంతో హఠాత్తుగా తేనెటీగల దాడి
- మృతదేహాన్ని వదిలి పరుగులు పెట్టిన కుటుంబ సభ్యులు, బంధువులు
- 26 మందికి గాయాలు, ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం
- రహదారిపైనే రెండుగంటల పాటు మృతదేహం


రహదారిపై ఉండిపోయిన వృద్ధురాలి మృతదేహం


గాయపడ్డ వారికి పీహెచ్‌సీలో చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ఏటపాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలు అనారోగ్యంతో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఊరేగింపుగా బాణసంచా కాలుస్తూ దహన సంస్కారాలు నిర్వ హించేందుకు అంతిమయాత్రగా వెళ్తున్నారు. ఆ యితే బాణసంచా కాల్చిన అలికిడికి తేనె తుట్ట కదిలి అంతిమయాత్రలో పాల్గొన్న వారిపై ఒక్క సారిగా దాడిచేశాయి. దీంతో వారు మృతదేహాన్ని అక్కడే వదిలి పెట్టి ప్రాణభయంతో పరుగులు తీశారు. దాంతో అంతిమ యాత్ర అగిపోయిన ఘటన శుక్రవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం గన్నేరుకొయ్యపాడు గ్రామంలో జరి గింది. గన్నేరుకొయ్యపాడు గ్రామానికి చెందిన కొప్పుల పల్లమ్మ (82) గురువారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం అంతిమయాత్ర ని ర్వహించారు. అయితే ఇందులో భాగంగా రెండు సార్లు బాణసంచాను కాల్చారు. దీంతో గన్నేరుకొయ్యపాడు గ్రామంలో 3 రహదారుల జంక్షన్ వద్ద మృతదేహాన్ని పాడె మీద నుంచి కిందికి దించి బాణసంచా కాల్చగా దాంతో చెట్టుపై తేనెపట్టులో ఉన్న తేనెటీగలు అంతిమయాత్రలో పాల్గొన్నవారిపై దాడి చేశాయి. దాంతో అక్కడ ఉన్న సుమారు 70 మంది తలో దిక్కుకు పరుగు తీశారు. 100పైగా తేనెటీగ లు మూకుమ్మడిగా దాడి చేశాయి. ముగడ చంద్రశేఖర్ అనే వ్యక్తి స్పృహ కోల్పోయారు. కొందరు నీటి దిమ్మల్లో దాక్కున్నారు. మరికొందరు ఇళ్లలోకి పరుగులు పెట్టారు. 26 మంది గాయపడ్డారు. వెంటనే సమీపంలోని గౌరిదేవి పేట పీహెచ్‌సీకి వెళ్లడంతో ఇద్దరు వైద్యులు, సిబ్బంది గాయపడ్డ వారి శరీరంపై తేనె టీగల ముళ్లను తొలగించారు. దాంతో వారికి ప్రాణా పాయం తప్పింది. ముగడ చంద్రశేఖర్, కొప్పుల వెంకటేశ్వర్లు, ముత్యాల నరేష్ పరిస్థితి ఆందోళ నకరంగా ఉండడంతో అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి పాల వడంతో పల్లమ్మ అంతిమయాత్ర ఆగిపోయి మృతదేహం రహదారిపై 2 గంటల పాటు ఉండి పోయింది. తేనెటీగలు ఇంకా చుట్టుముట్టి ఉన్నాయన్న భయంతో మృతదేహం వద్దకు వెళ్లేందుకు ఎవరూ సాహసించలేదు. తర్వాత మృతదేహాన్ని ట్రాక్టర్‌లో శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

పాము కాటుకు వ్యవసాయ కూలీ మృతి


మృతిచెందిన వెంకటేశ్వరరావు

ముమ్మిడివరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు వ్యవసాయ కూలీ మృతిచెందాడు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అయినాపురం రామాలయంపేటకు చెందిన దీపాటి వెంకటేశ్వరరావు(44) అదే గ్రామంలో ఒక రైతు పొలంలో కొబ్బరికాయలు పోగు చేస్తుండగా తాచుపాము కాటు వేసింది. అతడిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. అతడికి భార్య కనకలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముమ్మిడివరం స్టేషన్ హౌస్ ఆఫీసర్ జీవీ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరోచోట యువతి...


మరణించిన శృతిప్రియ

మామిడికుదురు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అదుర్రు గ్రామానికి చెందిన కంది శృతిప్రియ (24) పాము కాటుకు గురై గురువారం మృతిచెందింది. ఇంటి వద్ద దుస్తులు ఉతుకుతున్న సమయంలో వృక్షజాతికి పాముకాటుకు గురవ్వడంతో ఆమెను కుటుంబ సభ్యులు రాజోలు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ మరణించింది. ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు నగరం ఎస్ఐ చైతన్యకుమార్ కేసు నమోదు చేశారు.

మోటార్‌సైకిల్ ఢీకొని కల్లుగీత కార్మికుడి మృతి

గొల్లప్రోలు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కల్లు గీత కార్మికుడు మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు గుత్తుల అప్పారావు(65) సైకిల్‌పై ఏపీ మల్లవరం బయలుదేరాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొనడంతో అప్పారావుకు తీవ్రగాయాలయ్యాయి. తొలుత పిఠాపురం, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మరణించాడు. అప్పారావు కుమారుడు వెంకట సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త దుస్తులు కొన్నా.. కళ్లు తెరమ్మా!


విలపిస్తున్న అనూషా భార్గవి తల్లి, బంధువులు

- కాలువలో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి
- తట్టుకోలేక విలవిల్లాడిన తల్లి


భార్గవి (ఫైల్‌ఫొటో)

అనపర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో పుట్టినరోజు జరుపుకోవలసిన చిన్నారి కాలువ ప్రవాహంలో మృత్యువు కబళించింది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని నల్లకాలువలో పడి నాలుగేళ్ల చిన్నారి మృతిచెందింది. శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన మచ్చ అనూషాభార్గవి (4) అదృశ్యమైంది. తల్లిదండ్రులు దొరబాబు, భవానీ వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుమంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో సిబ్బంది పాప నివాసం ఉండే సమీపంలోని కాలువ వెంబడి గాలింపు చేపట్టగా సాయంత్రం చింతపల్లి లాకుల వద్ద పాప మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పాప ఆడుకుంటూ కాలువలోకి జారి పడి ఉంటుందని భావిస్తున్నట్టు సీఐ తెలిపారు. మే నెల 28న పుట్టినరోజు జరుపుకునేందుకు చిన్నారికి కొత్త దుస్తులు కూడా కొన్నానని, తాను ఇప్పుడు ఎవరికి పుట్టినరోజు ఎవరికి చేయాలంటూ చిన్నారి తల్లి భవాని రోదనలతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చిన్నారి మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీసుకువస్తున్న సీఐ సుమంత్

అనారోగ్యం ఉన్న ఉపాధ్యాయులకు
స్పాట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ త్రినాథబాబు

దివాన్‌చెరువు, మార్చి28 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక, తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న ఉపాధ్యాయులకు పదవతరగతి మూల్యాంకనం విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయ త్రినాథబాబు అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 వతరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకన ప్రక్రియ వచ్చేనెల మూడో తేదీ నుంచి నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారన్నారు. అయితే ఆరోగ్య సమస్యలతో బాధపడే ఉపాధ్యాయుల అభ్యర్థనలను పరిగణలోనికి తీసుకుని వారిని మూల్యాంకనం విధుల నుంచి మినహాయించాలని సూచించారు. అలాగే వేసవిలో వేడెక్కుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మూల్యాంకన విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. చల్లని వాతావరణం, సౌకర్యవంతమైన సీటింగ్, అంతరాయం లేని విద్యుత్ సరఫరా వంటి ఏర్పాట్లు మధ్య మూల్యాంకన ప్రక్రియ జరిగేలా చూడాలని త్రినాథ బాబు అధికారులకు విజ్ఞప్తిచేశారు.

వార్షిక ప్రణాళికపై డ్వాక్రా సంఘాలకు శిక్షణ

సీతానగరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండల సమాఖ్య కార్యాలయంలో స్వయం శక్తి సంఘాల ఆర్థిక జీవనోపాధికి వార్షిక ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం మండల సమాఖ్య అధ్యక్షురాలు కందికట్ల అరుణకుమారి అధ్యక్షతన జరిగింది. ఏపీఎం జిలాని మాట్లాడుతూ మండల స్థాయిలో 236 ఎన్యుమరేటర్లను ఎంపిక చేసి ప్రతి ఎన్యుమరేటర్‌కు ఐదు నుంచి ఆరు సంఘాలను ట్యాగ్ చేసి ప్రతి సంఘం లైవ్ మీటింగ్‌లు నిర్వహించే విధంగా సంఘం సమావేశ స్థలం జియోటాగ్ చేయాలన్నారు. ప్రతి సభ్యురాలు హాజరుకావాలని, అందరి ఫొటోలు తీసుకుని అటెండెన్స్ తీసుకోవాలని చెప్పారు. అలాగే కుటుంబ జీవనోపాధి వివరాలు, ఆర్థిక సంవత్సరానికి వారి ఆదాయం, కుటుంబ సభ్యుల వృత్తి ఉద్యోగాలు నమోదు చేయాలని సూచించారు. అదే విధంగా సభ్యురాలి జీవనోపాధి నిమిత్తం భవిష్యత్తులో అవసరమయ్యే రుణాలను సైతం ఈ సర్వేలో నమోదు చేసి రుణం పొందే విధంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసే విధంగా ఎన్యుమరేటర్లు డేటా ఎంట్రీ చేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ఆరు రోజుల పాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు హరిబాబు, ధారా లక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, ఎక్కౌంటెంట్ జయరాజ్, వీవోఏలు పాల్గొన్నారు

నేడు నూకాలమ్మ తీర్థ మహోత్సవం


రాజానగరంలో ఊరేగుతున్న అమ్మవారి ప్రతిరూపంగా భావించే తాటిచెట్టు

రాజానగరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాజానగరం గ్రామ దేవత శ్రీనూకాలమ్మ తీర్థ మహోత్సవాన్ని ఈనెల 29న నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి అమ్మవారి జాతర బాణసంచా కాల్పులు నడుమ వైభవంగా నిర్వహించారు. శనివారం అమ్మవారి తీర్థాన్ని వైభవరంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే అమ్మవారి ప్రతిరూపంగా భావించే తాటిచెట్టును ఎద్దుల బండిపై ఉంచి శుక్రవారం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం తాటి చెట్టును అమ్మవారి ఆలయ సన్నిధిలో ఊయల ఏర్పాటు చేస్తారు. అమ్మ వారి దర్శనం చేసుకున్న భక్తులు ఊయల ఊగడం అక్కడి సంప్రదాయం. ఈ సందర్భంగా అమ్మ వారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపు మానుకోవాలి

రాజమహేంద్రవరంలోని ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్‌భారాలను ఉపసంహరించుకోవాలని, ట్రూఅప్ చార్జీల బాదుడు రద్దు చేయాలని, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని మానుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరంలోని ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి కర్రి రామకృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పవన్ మాట్లాడుతూ ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలకు, చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలకు ప్రి పెయిడ్ మీటర్లు బిగించారని, వినియోగదారుల అనుమతిలేకుండా స్మార్టు మీటర్లు ఎలా బిగిస్తారని అన్నారు. జిల్లాలో ఎక్కడ స్మార్ట్‌మీటర్లు బిగించినా ప్రజలందరూ ప్రతిఘటించాలని కోరారు. ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వంచించడం తగదని పేర్కొన్నారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకులు ఎస్ఎస్ మూర్తి, పూర్ణిమరాజు, పి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చితే బీజేపీకి పుట్టగతులుండవు

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ప్రపంచంలో మంచి గౌరవం ఉందని, అలాంటి లౌకిక రాజ్యాంగాన్ని మార్చితే బీజేపీ పార్టీకి పుట్టగతులుండవని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. శుక్రవారం సీపీఐ రాజకీయ ప్రచారజాత రాజమహేంద్రవరంలోని ప్రచారజాత ఆర్టీసీ కాంప్లెక్స్, వెంకటేశ్వర కాలనీ, రైతుబజార్ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు, ఆర్టీసీ ప్రయాణికులకు కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. అనంతరం మధు మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశాలు నిర్వహించడం అభినందనీయమని, గోదావరి పుష్కరాలకు ముందే రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలన్నారు. 1925లో ఏర్పడిన ఆర్ఎస్ఎస్ ఈ దేశానికి చేసిందేమీ లేదని, బ్రిటీష్‌వారితో లాలూచీ పడి వారికి కొమ్ముకాసిందని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కించపర్చడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు తగదని అన్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో మత విద్వేషాలు రెచ్చగొడుతూ అల్లర్లు సృష్టిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జట్లు సంఘం అధ్యక్షుడు కె.రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి, పి.లావణ్య, సీహెచ్ సునీల్ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసనగా శాంతి ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సువార్తీకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా రాజమహేంద్రవరంలో దళిత క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొతులతో శాంతి ర్యాలీ చేశారు. శుక్రవారం రాత్రి స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన శాంతి ర్యాలీలో కోరుకొండ చిరంజీవి, జంగా సుబ్బారావు, పాస్టర్ పి ఎర్నెస్ట్ మోజెస్, జువ్వల రాంబాబు, తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, దళితులకు, క్రైస్తవులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత క్రైస్తవ నాయకులు ధారా యేసురత్నం, అర్దాల కుమార్‌బాబు, పాము బాబురావు, దవ్వాడ రాజా, మచ్చ శామ్యూల్‌జాన్, సోమబత్తుల విజయకుమార్, డాక్టర్ బి.కిరణ్ బాబు, గన్నెయ్య, ఆనందకుమార్, ఉసురు మర్తి రామారావు, డాక్టర్ విల్సన్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు-క్వారీ మార్కెట్ రోడ్డు విస్తరణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు 2027 ను దృష్టిలో పెట్టుకుని మధురపూడి విమానాశ్రయం నుంచి రాజమండ్రి క్వారీ మార్కెట్ వరకు ఉన్న ఆక్రమణలు తొలగించి రహదారి విస్తరిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. శుక్రవారం ఆక్రమణల తొలగింపు పనులను కమిషనర్ తనిఖీ చేశారు. పంచాయతీ సెక్రటరీలతో, శానిటేషన్‌పై సమీక్షించారు. శానిటేషన్ క్రమపద్ధతిలో చేసేందుకు ప్రణాళిక చేశారా అని అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్‌కు అవసరమైన ట్రాక్టర్లు, ట్రైసైకిళ్ల కొనుగోలు చేసి ఇంటింటికీ చెత్తసేకరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేయాలని ఆదేశించారు. ఆవులను రోడ్డుపై వదిలితే వాటి యజమానులకు జరిమానాలు విధించాలని ఆదేశించారు.

రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శోభనాద్రి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం సందడిగా జరిగాయి. ఈ ఎన్నికల్లో 870 మంది న్యాయవాదులు తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బార్ అసోసియేషన్ కార్యవర్గంలో మొత్తం 8 పదవులకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల పోలింగ్ సాయంత్రం 5గంటలకు ముగిసింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ రాత్రి 10:30గంటల వరకు సాగింది. ఈ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షుడిగా పీవీఎస్‌కే శోభనాద్రి శాస్త్రి 443 ఓట్లతో సాధించి విజయం సాధించారు. అలాగే ఉపాధ్యక్షుడిగా అల్లమపల్లి రామకృష్ణ, జనరల్ కార్యదర్శిగా పి.రమేష్, జాయింట్ సెక్రటరీగా మలక శ్రీనివాస్, కోశాధికారిగా కర్ర హనుమంతరావుతో పాటు మరో పది మందితో కొత్త కార్యవర్గం ఏర్పడింది. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా కె.మల్లేశ్వరరావు వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి బార్ అసోసియేషన్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఏప్రిల్ 1 నుంచి సదరం స్లాట్స్ బుకింగ్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1వ తేదీ నుంచి దివ్యాంగులకు సదరం స్లాట్స్ బుక్కింగ్ తిరిగి ప్రారంభిస్తున్నామని ప్రభుత్వం వెల్లడించింది. ప్రతి మంగళవారం ఎంపిక చేసిన ప్రాంతీయ, జిల్లాఆసుపత్రులు, బోధనాసుపత్రుల్లో సదరం క్యాంపులు అందుబాటులో ఉంటాయని, స్లాట్స్ బుక్‌చేసుకున్న తర్వాత వెరిఫికేషన్‌లో అర్హులైన వారికి సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. సదరం సర్టిఫికెట్ల కోసం సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో స్లాట్స్ బుక్ చేసుకోవాలని పేర్కొంది.

ఏప్రిల్ 1న పదో తరగతి సోషల్ పరీక్ష

రాజమహేంద్రవరం సిటీ మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం ఉత్తర్వుల మేరకు జిల్లాలో పదో తరగతి సోషల్ పరీక్ష ఏప్రిల్ 1న నిర్వహిస్తున్నట్టు జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 1వ తేదీ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు సోషల్ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

కనెక్టివిటీ రోడ్లకు ప్రాధాన్యం

పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే బత్తుల సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దీర్ఘ కాలికంగా పెండింగ్, గ్రామాల మధ్య కనెక్టివిటీకి దోహదపడే రోడ్లకు ప్రాధాన్యం కల్పిస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. పంచాయతీ రోడ్ల ప్రగతిపై పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే శుక్రవారం సమీక్షించారు. నియోజకవర్గంలో కీలకమైన అన్ని రహదారులను సత్వరమే పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన అన్ని రోడ్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. రాపాక రోడ్డును తక్షణమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్య మైన రోడ్లను నాబార్డ్, పీఆర్ ప్లెయిన్ నిధులతో ప్రతిపాదన చేయాలన్నారు. సీతానగరం, పురుషో త్తపట్నం రోడ్డును అభివృద్ధి చే యడం వల్ల రైతులు, ప్రయాణి కులకు సౌకర్యంగా ఉంటుంద న్నారు. అలాగే కోటి-కూనవరం రోడ్డు పనిలో వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేసి ఉపయోగం లోకి తీసుకురావాలని, గాదరాడ-కనుపూరు, గాదరాడ-నందరాడ రోడ్ల పనుల ప్రగతిపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో పంచాయితీరాజ్ డీఈ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రఘుదేవపురంలో పల్లెబాట

సీతానగరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘుదేవపురం పంచాయతీ ఆవరణలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరితో కలసి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పల్లెబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. టీడీపీ నాయకుడు కాండ్రు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా జనవాణి నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చించారు. వీటిలో కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం కాగా, మరి కొన్నింటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇసుక ఉచితం చేయడం ద్వారా ట్రాక్టర్ డ్రైవర్లు, కూలీలు, భవన కార్మికులకు చేయూతనిచ్చినట్లు అయ్యిందన్నారు. సీతానగరం-పురుషోత్తపట్నం రోడ్డుకు ఉగాది వెళ్లిన తరువాత శంకుస్థాపన చేసి 3 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. నాలుగు లైన్ల రోడ్డు రఘుదేవపురం నుంచి సీతానగరం ఆగిపోయిందని, గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు చేతులెత్తేశాడని, దానిని త్వరలో అనుమతులు పొంది పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, గద్దే సురేష్, గెద్దాడ త్రిమూర్తులు పోలిన కృష్ణ సానిపిని రామారావు, కాండ్రు శేఖర్, ఎంపీడీవో భారతి, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ మూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారానికి కూటమి కృషి

- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లకు అదనపు ఆర్థిసాయం


కడియంలో లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం/రాజమహేంద్రవరం రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పేదవాని సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శుక్రవారం కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండల పరిషత్ కార్యాలయాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన గృహనిర్మాణ లబ్ధిదారులతో శుక్రవారం వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ గత ప్రభు త్వం జగనన్న కాలనీల పేరుతో ప్రజలను దగా చేసిందన్నారు. నియోజకవర్గంలో ఉండే పేదలకు సుదూర ప్రాంతాల్లో స్థలాలు కేటాయించి మోకాలి లోతు ప్రాంతాల్లో స్థలాలను చూపించి ప్రజలను నట్టేట ముంచేసారని ఆరోపించారు. గృహనిర్మాణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కూటమి పెద్దపీట వేస్తోందని, అసంపూర్తిగా నిలిచిన గృహనిర్మాణాలు పూర్తి చేసేందుకు అదనంగా మరో రూ.50 వేలు లబ్ధిదారులకు అందిస్తున్నట్టు గోరంట్ల పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం లో తొర్రేడు, కాతేరు, కోలమూరు, పిడింగొయ్యి గ్రామాల్లో 129 మంది, కడియం మండలంలో కడియపు లంక, కడియం, జేగురుపాడు, మాధవరాయుడు పాలెం, దుళ్ల, మురమండ, పొట్టిలంక, వీరవరం, దామిరెడ్డిపల్లి గ్రామాల్లో 79 మంది లబ్ధిదారులకు వారి ఖాతాలకు సొమ్ములు జమచేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ప్రత్యేకాధికారి ఎన్.జ్యోతి, ఎంపీడీవోలు డి.శ్రీనివాస్, కె.రమేష్, నాయకులు మత్యేటి ప్రసాద్, వెలుగుబంటి రఘురామ్, వాసిరెడ్డి రాంబాబు, మార్ని వాసు, మార్గాని సత్యనారాయణ, బోడపాటి గోపి, ప్రత్తిపాటి రామారావుచౌదరి, ఆళ్ల ఆనందరావు, ముద్రగడ జమీ, బొర్సు సుబ్రహణ్యం, హౌసింగ్ ఏఈ బీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డులు అందజేయాలి

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్తకు సభ్యత్వ కార్డు అందజేసేలా టీడీపీ కుటుంబ సభ్యులంతా బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. తన కార్యాలయంలో పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 57 వేల మంది పైచిలుకు సభ్యత్వాలు నమోదయ్యాయని, వాటిని బూత్‌ల వారీగా విభజించి సభ్యత్వ కార్డులు అందించాలన్నారు. అలానే కుటుంబ సాధికార సభ్యులుగా నియ మించాలని ప్రతి 60 మంది ఓటర్లకు ఒక మహిళ, ఒక పురుషుడు సాధికార సభ్యులుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగిన హనుమంతరావు, మత్యేటి ప్రసాద్, కురుకూరి కిషోర్, దండమూడి బాపినీయుడు, ఐటీడీపీ సభ్యులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు
ఐదుగురు గైర్హాజరు

రంగంపేట,మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిశలేరు, రంగంపేట, సింగంపల్లి గ్రామాల్లోని జడ్పీ హైస్కూళ్లలో జరిగిన పదో తరగతి జీవశాస్త్ర పరీక్షలకు 581 మంది విద్యార్థులకు గాను 576 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి పి.మధుసూధనరావు తెలిపారు.రంగంపేటలో 212 మందికి 209 మంది, వడిశలేరులో 185 మందికి 184 మంది, సింగంపల్లి హైస్కూల్లో 184 మందికి 183 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు పేర్కొన్నారు.

బిక్కవోలులో ఏడుగురు..

బిక్కవోలు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన పదో తరగతి బయాలజీ పరీక్షకు శుక్రవారం ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. బలభద్రపురం కేంద్రంలో ఇద్దరు, పందలపాక కేంద్రంలో ఐదుగురు హాజరు కాలేదని ఆయన వివరించారు.

ప్రతిభావంతులైన
విద్యార్థులకు సత్కారం

కడియం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కడియం జడ్పీ ఉన్నత పాఠశాల 2018-19 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి పాటి సత్యప్రసన్న, యర్రంశెట్టి సౌమ్య, పోశి మంజులను పాఠశాల ఆవరణలో సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించారు. ట్రిపుల్‌ఐటీ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాలు సాధించిన సందర్భంగా హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు అక్షయ, నాగమణి, పద్మశ్రీ, శరత్ బాబు, శ్రీనివాస్, వీరబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూ పరామర్శ

గోకవరం, మార్చి28(ఆంధ్రజ్యోతి): ఇటీవల శస్త్ర చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మండలంలోని భూపతిపాలెం గురుకుల ఆశ్రమ పాఠశాల చైర్మన్ గల్లా రామును శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. ఈ సందర్భంగా గాదెలపాలెంలోని రాము స్వగృహానికి ఎమ్మెల్యే వెళ్ళి ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడపా భరత్, కన్నబాబు, ఈది అశోక్, నాగం వెంకటపతి, పెద్దాడ వెంకన్నదొర, మండిగ గంగాధర్ పాల్గొన్నారు.

ఫార్మడీ విద్యార్థిని బాధ్యత ప్రభుత్వానిదే

మహిళా సంఘాల ఐక్య వేదిక నేతలు పద్మశ్రీ, రమాదేవి


విద్యార్థిని అంజలి పరిస్థితిని చూస్తున్న పద్మశ్రీ, రమాదేవి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఫార్మడీ ఫైనలియర్ విద్యార్థిని ఎన్.నాగఅంజలి బాధ్యత ప్రభుత్వానిదేనని మహిళా సంఘాల ఐక్యవేదిక నేతలు సుంకర పద్మశ్రీ, డి.రమాదేవి అన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి రాజమహేంద్రవరం చేరుకున్న ఐక్యవేదిక సభ్యులు కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడారు. అనంతరం అంజలి తల్లిదండ్రులతో మాట్లాడారు. వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. నిందితుడికి ఆసుపత్రి యాజమాన్యం కొమ్ముకాస్తోందని, ఆమెకు మెరుగైన వైద్యాన్నందించి బతికించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం, కిమ్స్ యాజమాన్యం తీసుకోవాలన్నారు. ఇతర దేశాల్లోనైనా ఆమెకు వైద్యం చేయించాలన్నారు. ఘటన జరిగి రోజులు గడుస్తున్నా ఆసుపత్రికి ఇప్పటివరకు హోం మంత్రి అనిత రాలేదని విమర్శించారు. నిందితుడు దీపక్ గతంలోను ఆడపిల్లలతో అసభ్యకరంగా మాట్లాడాడట, అతన్ని ఎందుకు కిమ్స్ యాజమాన్యం ఆసుపత్రిలో ఉంచిందని నిలదీసారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన దీపక్‌పై రేప్‌తో పాటు సెక్షన్ 63పీఎన్ఎస్ కింద కేసులు పెట్టాల న్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఐద్వా నాయకురాళ్లు యామిని, తులసి పాల్గొన్నారు.

కోలమూరులో ఆక్రమణల తొలగింపు

- స్వల్ప ఉద్రిక్తత
- పంచాయతీ సిబ్బందిపై చేయిచేసుకున్న స్థానికుడు
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కార్యదర్శి


కొంతమూరులో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలమూరు పంచాయతీ పరిధిలో కొంతమూరు పోలీస్ అవుట్ పోస్టు వద్ద నుంచి శానిటోరియం వరకు ప్రధాన రహదారికి ఇరు వైపులా వున్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. స్థానికులు కొందరు ప్రధాన డ్రైనేజీని ఆక్రయించి వాటిపై వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీంతో డ్రైనేజీలలో పూడుకు పోయిన చెత్త తొలగించే వీలు లేక కొన్ని ప్రాంతాలు ముంపుకు గురౌతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ ప్రత్యేకాధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అదేశాల మేరకు పంచాయతీ కార్య దర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆక్రమణలను తొలగింపు పనులు చేపట్టారు. అయితే దుర్గ మ్మ తల్లి గుడి ఎదురుగా ఆక్ర మణలు తొలగిస్తుండగా కొందరు స్థానికులు పనులను అడ్డగించి పంచాయతీ సిబ్బందిపై దుర్భాషలాడుతూ గొడవపడ్డారు. ఈ క్రమంలో యామన సత్యనారాయణ అనే వ్యక్తి శానిటరీ మేస్త్రి మద్దా ప్రకాష్‌ను రాయితో తలపై కొట్టడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సముదాయించారు. అనంతరం పంచాయతీ సిబ్బందిపై చేయిచేసుకున్న సత్యనారాయణపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఒక యువతి మోసానికి పాల్పడిన ఘటనపై ఆసుపత్రి ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లింది. ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసానికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న యువతి ఇటీవల కొన్ని నెలలపాటు ఆసుపత్రిలోని పలు విభాగాల్లో పనిచేసినట్టు చెబుతున్నారు. ఎంఎల్‌టీ, ఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన యువత ప్రభుత్వ బోధనాసుపత్రిలో అప్రెంటిస్‌షిప్‌కు వస్తుంటారు. అలా ప్రభుత్వాసుపత్రికి వచ్చిన యువకులను బురిడీ కొట్టించినట్టు సమాచారం. ఆసుపత్రిలోని కొందరు ఉద్యోగులతో ఉన్న పరిచయాలను ఆసరాగా చేసుకుని ఉద్యోగాలు వేయిస్తానని చెప్పి భారీగా డబ్బులు వసూలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే రోజులు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడంతో డబ్బులిచ్చిన యువకులు ఆమెను నిలదీయడం తోపాటు బోధనాసుపత్రి మేనేజర్‌కు, సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేయడంతో అసలు బండారం బయటపడింది.

భారత క్యాలెండర్ ప్రాముఖ్యతపై ఆర్ట్స్‌లో సెమినార్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్రదాయంలో ఖగోళ శాస్త్రం, పండుగలు, సమయపాలనతో దాని లోతైన సంబంధాన్ని కలిగి ఉంటాయని బెంగుళూరులోని చాణక్య విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ రామకృష్ణ పెజాత్య అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కళాశాల లలిత కళల విభాగం, తత్వశాస్త్రం, రాజనీతిశాస్త్రం, సోషల్‌వర్క్ డిపార్టుమెంట్ సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ జ్ఞాన వ్యవస్థ ఉపన్యాస క్రమంలో మొదటి ఉపన్యాసంగా భారత క్యాలెండర్ ప్రాముఖ్యతపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ప్రొఫెసర్ రామకృష్ణ మాట్లాడుతూ భారతీయుల కాలగమన గణన, రుతువుల క్రమానుసారంగా ప్రకృతి అందించే పంటల విజ్ఞానాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, రాజకీయశాస్త్ర విభాగాధిపతి పి.బాబ్జీ, ఫైన్‌ఆర్ట్స్ ఇన్‌చార్జి కె.సీతామహాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా భరత్


భరత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు అడపా భరత్‌కుమార్‌ను కూటమి ప్రభుత్వం నియమించింది. నామినేటెడ్ పదవుల్లో భాగంగా సీఎం చంద్రబాబు ప్రకటించిన జాబితాలో భరత్‌కు ఈ గౌరవం దక్కింది. 30 ఏళ్లుగా టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తున్న భరత్ ప్రస్తుతం రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. భరత్‌ను శుక్రవారం తంటికొండ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి విచ్చేసిన ఎమ్మెల్యే నెహ్రూ సత్కరించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ జగ్గంపేట మార్కెట్‌ను రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి కూటమితోనే సాధ్యం

డ్వాక్రా మహిళలు 25మందికి ఎలక్ట్రికల్ స్కూటీల పంపిణీలో ఎమ్మెల్యే వాసు


మహిళలకు స్కూటీల పంపిణీలో ఎమ్మెల్యే వాసు, కమిషనర్ కేతన్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణంలో స్వయం సహాయక సంఘం సభ్యులు 25 మందికి ఎలక్ట్రికల్ స్కూటీలను పంపిణీ చేశారు. దీనికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గార్గ్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ డ్వాక్రా సభ్యుల జీవనోపాధి మెరుగు కోసం మెప్మా ద్వారా రాపిడో భాగస్వామ్యంతో వివిధ బ్యాంకుల ద్వారా రుణ సదుపాయంతో వీటిని పంపిణీ చేస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుందని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వంద ఈ రిక్షాలు కూడా ఏర్పాటు చేసే యోచన ఉన్నందున మహిళలను భాగస్వామ్యం చేయాలని ఆదిరెడ్డి శ్రీనివాస్ కమిషనర్‌ను కోరారు. మహిళ రైడర్లు ఎస్ఓఎస్, శక్తి యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మెప్మా ద్వారా రాపిడో భాగస్వామ్యంతో నడిపేందుకు ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని విశాఖపట్నంలో 400 స్కూటీలు, విజయవాడలో 400, నెల్లూరులో 50, గుంటూరులో 50, కర్నూలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రి పట్టణాలకు 25 చొప్పున మొత్తం వేయి మందికి ఈ ఎలక్ట్రికల్ బైక్‌లను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వ్యక్తి అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆర్టీసీ కాలనీకి కె.మణికంఠ ఈనెల 27వ తేదీ నుంచి కనిపించడంలేదని ప్రకాష్‌నగర్ పోలీసులు తెలిపారు. ఇంటి నుంచి ఊరు వెళ్లిన మణికంఠ ఈనెల 27 తిరిగి రాజమహేంద్రవరం చేరుకున్నాడని కాని ఇంటికి రాలేదని ఎటు వెళ్లాడో తెలియడం లేదని వెతికినా కనిపించకపోవడంతో అతడి మేనమామ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:21 (శనివారం సాయంత్రం)
సహర్ : 4:38 (ఆదివారం ఉదయం)

52,173 మంది ఏమయ్యారు!



తొలి విడత ఉచిత సిలిండర్‌కు రెండ్రోజులే గడువు

ఇంకనూ అందుకోని లబ్ధిదారులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మరో రెండు రోజుల్లో తొలివిడత ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ముగియనుంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకంలో తొలి సిలిండర్ ప్రయోజనాన్ని జిల్లాలో ఇంకా 52,173 మంది అందుకోవాల్సి ఉంది.ఈ నెల 31వ తేదీ వరకూ మాత్రమే తొలి ఉచిత సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం ఉంది. దీంతో ఎంతమంది లబ్ధిదారులు వినియోగించుకుంటారనే దానిపై జిల్లా పౌర సరఫరాల అధికారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మిగిలిన వారికి ప్రయోజనం అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.దీనిలో భాగంగా ఆయా ప్రాంతాల్లోని గ్యాస్ డీలర్ల ద్వారా లబ్ధిదారులకు సమాచారం అందజేస్తున్నారు. జిల్లాలో మొత్తం 4,68,010 మంది ఎల్‌పీజీ లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకూ 4,15,837 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. వారిలో గురువారం నాటికి 4,05,747 మందికి గ్యాస్ డెలివరీ చేశారు.మరో 10,090 మందికి గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయాల్సి ఉంది.ఒకట్రెండు రోజుల్లో వీరికి గ్యాస్‌సిలిండర్ డెలివరీ జరుగుతుందని జిల్లా పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అర్హత కలిగి గ్యాస్ బుక్ చేసుకోని 52,173 మందిలో ఎంతమంది ప్రయోజనాన్ని పొందుతారనేది చూడాల్సి ఉంది.

పంట పండింది!





రాజమహేంద్రవరం రూరల్‌లో కోతకు సిద్ధమైన వరిచేను

తూర్పు పంట పండింది..దీంతో రబీ కోతలు ఆరంభమయ్యాయి. జిల్లాలో రాజమండ్రి రూరల్, రాజానగరం,కోరుకొండ, సీతానగరం, రంగంపేట,గోకవరం మండలాల్లో ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభమయ్యాయి.జిల్లాలో 60,042 హెక్టార్లలో వరి ఆయకట్టు ఉండగా రబీలో 58,586 హెక్టార్లలో వరిసాగు చేశారు.రాజమహేంద్రవరం రూరల్‌లో 1299 హెక్టార్లు సాగుచేయగా ఇప్పటికే 700 హెక్టార్లలో కోతలయ్యాయి. ఇది 53.9 శాతం. సీతానగరం మండలంలో 4443 హెక్టార్లలో సాగుచేయగా 800 హెక్టార్లలో కోతలయ్యాయి. ఇది 18శాతం. రాజానగరంలో 3229 హెక్టార్లలో సాగుచేయగా 259 హెక్టార్లలో పూర్తయ్యాయి. ఇది 8 శాతం.కోరుకొండలో 2251 హెక్టార్లలో సాగు చేయగా 320 హెక్టార్లలో కోతలయ్యాయి. 14.2 శాతం. గోకవరం మండలంలో 1989 హెక్టార్లలో సాగు చేయగా 20 హెక్టార్లలో కోశారు. ఇది 1 శాతం. రంగంపేటలో 849 హెక్టార్లలో సాగు చేయగా 83 హెక్టార్లలో కోశారు. ఇది. 9.8 శాతం. చాగల్లులో 3307 హెక్టార్లలో సాగు చేయగా కేవలం 2 హెక్టార్లలో మాత్రమే కోశారు. పెరవలిలో 3305 హెక్టార్లలో సాగు చేయగా 8 హెక్టార్లలో కోశారు. గోపాలపురంలో 2221 హెక్టార్లలో సాగు చేయగా 12 హెక్టార్లలో కోశారు.మిగతా మండలాల్లో ఇంకా కోతలు ఆరంభంకాలేదు.మరో పక్క ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు జిల్లాలో ఎకరాకు 40 నుంచి 50 బస్తాల వరకూ దిగుబడి వస్తుందని తెలిపారు. -(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)



అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బరుకు కేటాయించిన 200 ఎకరాల మ్యాప్ పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

ఆనంద..తీరం!

మళ్లీ తెర మీదకు 'డ్రెడ్జింగ్' కార్పొరేషన్, యూనివర్సిటీ

- పదేళ్ల కిందట చంద్రబాబు ప్రకటన
- నాడు చొరవ చూపని కేంద్రం
- కనీసం పట్టించుకోని వైసీపీ
- కూటమి రాకతో మళ్లీ వెలుగు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- నేడు కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్
- అంతర్వేదిలో ఆర్డీవో పర్యటన
- 200 ఎకరాల భూముల గుర్తింపు

అంతర్వేది, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబునాయుడు డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను అంతర్వేది తీరంలో ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై అప్పటి ఎంపీగా ఉన్న డాక్టర్ పండుల రవీంద్రబాబు కార్పొరేషన్ ఏర్పాటుకు తన వంతు కృషి చేశారు. అయితే అప్పట్లో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నష్టాల్లో ఉందన్న సాకుతో ఈ ప్రతిపాదనకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. దాంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్, యూనివర్సిటీ ఏర్పాటు కాలేదు. అప్పట్లో కార్పొరేషన్ వస్తుందన్న ప్రచారంతో సముద్రతీర ప్రాంతంలో తక్కువ ధర ఉన్న భూములను సైతం అధిక ధరలకు కొనుగోలు చేసి రిసార్టులు, ఇతర భవనాలు నిర్మించారు. కానీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రతిపాదన గత పదేళ్లలో మరుగున పడిపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ ఊసేలేదు. కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ సీఎం చంద్రబాబు అంతర్వేది తీరంలోనే అనువైన ప్రదేశంగా భావించి అక్కడే డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలనే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. దీనికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సైతం మొగ్గు చూపడంతో మళ్లీ ప్రాజెక్టు అమలుపై జిల్లా ప్రజల్లో ఆశలు చిగురించాయి. దీనిలో భాగంగా శుక్రవారం అమలాపురం ఆర్డీవో కె.మాధవి అంతర్వేది తీరాన్ని పరిశీలించి డ్రెడ్జింగ్ కార్పొరేషన్, యూనివర్సిటీ ఏర్పాటుకు సుమారు 200 ఎకరాల భూమి అవసరంగా భావించి పరిశీలన చేసి ప్రాథమికంగా మార్కింగ్ కూడా ఇచ్చారు. దాంతో ఇప్పుడు మళ్లీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఏర్పాటుపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ కార్పొరేషన్ ద్వారా రాజోలు నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, ఇతర సౌకర్యాలు లభిస్తాయనేది వారి ఆకాంక్ష. ప్రస్తుతం ఆర్డీవో మాధవి తీర ప్రాంత భూముల పరిశీలనతో ఆ ప్రాంతంలో మళ్లీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో హడావుడి నెలకొంది.

చిగురించిన ఆశలు

భూములు పరిశీలించిన ఆర్డీవో..

సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీర ప్రాంతంలో డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్సిటీ కోసం స్థల పరిశీలన చేశామని అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం ఆమె దర్శించుకుని అనంతరం అంతర్వేది నుంచి చింతలమోరి వరకు ఉన్న తీర ప్రాంత భూములను స్థానిక అధికార యంత్రాంగం, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బరు ఏర్పాటుకు 200 ఎకరాల స్థలాన్ని గుర్తించామన్నారు.ఆ భూముల్లో ప్రస్తుతం రూ.1850 కోట్లతో డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్సిటీ ఏర్పాటు చేస్తారన్నారు. ఇప్పటికే సముద్రతీరంలో పెరుగు భూములను పరిశీలించి మార్కింగ్ వేశామని, వాటిని సర్వేచేయించి ఎంత భూమి అవసరం అవుతుందో మ్యాపు ద్వారా పరిశీలించి నివేదిక తయారు చేస్తామన్నారు. తీర ప్రాంత భూముల్లో సరుగుడు, కొబ్బరి వేసి ఉన్న రైతులకు నష్టం కలుగుతుందని రైతులు అమలాపురం ఆర్డీవో కె.మాధవిని అడగ్గా ఆమె రైతులతో మాట్లాడారు. పెరుగు భూమిలోనే సాగు చేసుకుంటున్నారు కదా నష్టపోయేదేమి ఉంది.. ప్రభుత్వం స్వాధీన పరుచుకుని డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్సిటీ ఏర్పాటుచేస్తే అంతర్వేది పరిసరాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రోడ్లు, ఉపాధి కలుగుతుందని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, ఆర్ఐ రామరాజు, సర్వేయర్ భద్రరాజు, పలు సొసైటీల అధ్యక్షులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ పాపాల పుట్ట.. ఈ మెట్ట : ఎటు చూసినా రామేశం మెట్టంతా ఇలా గుల్లగుల్ల చేశారు. (ఫైల్)

రామేశం మెట్టలో.. పాపాల ద్వారం!

గత ఐదేళ్లూ కొండలను మింగేసిన ఘనులు

గత వైసీపీ ఐదేళ్ల పాలనకు పై చిత్రం ఒక నిదర్శనం.. ఉమ్మడి జిల్లాలో చాలా కొండలది ఇదే పరిస్థితి.. కన్నుపడితే చాలు ఖాళీ చేసేశారు.. కొండలను మింగేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.. ఇదెక్కడో మారుమూల కాదు.. పెద్దాపురం రామేశం మెట్ట.. ఏకంగా 823 ఎకరాల్లో ఉన్న కొండ నేడు ఇలా తయారైంది.. గత ఐదేళ్లలో ఈ కొండను గుల్ల చేసి వేల కోట్లు దందా చేశారు.. ఎన్‌జీటీ దృష్టి సారించడంలో పాపాల ద్వారాలు తెరుచుకోనున్నాయి.. అక్రమార్కుల భరతం పట్టే సమయం ఆసన్నమైంది.

- కాకినాడ/ఆంధ్రజ్యోతి

- నాడు రెచ్చిపోయిన మాఫియా
- అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకం
- 823 ఎకరాలు గుల్లగుల్ల
- లక్షల క్యూబిక్ మీటర్ల తరలింపు
- 19న ఎన్‌జీటీ కోర్టులో కేసు
- కాకినాడ కీలక నేత కనుసన్నల్లో దందా
- రిజర్వు ఫారెస్టు మింగేసిన వైనం
- రూ.250 కోట్ల రాయల్టీ ఆదాయానికి గండి



పెద్దాపురం రామేశ్వరం మెట్ట అక్రమ తవ్వకాలపై అక్రమార్కులకు ఉచ్చు బిగుస్తోంది. ఇన్నేళ్లపాటు యథేచ్ఛగా 823 ఎకరాల్లో కొండలను గుల్ల చేసి గ్రావెల్ తవ్వుకుపోయి వందల కోట్లు సంపాదించిన నేతలు, అధికారులపై ఎన్‌జీటీ రూపంలో భారీ షాక్ తగలబోతోంది. ఇక్కడ వేల కోట్ల దందాపై చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ దృష్టి సారించింది. దీంతో అక్రమార్కులు, వారికి కొమ్ముకాసిన అధికారులు ఇరుక్కోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కొండలు గుల్ల గుల్ల

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, కోనసీమ, యానాం తదితర ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్, రహదారుల నిర్మాణ అవసరాలకు మట్టి, గ్రావెల్‌కు భారీ డిమాండ్ ఉండేది. రామేశం మెట్టలో తవ్విన కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చదును కోసం అమ్మని రియల్ ఎస్టేట్ వెంచర్ లేదు. వేల టిప్పర్ల మట్టి, గ్రావెల్‌ను కాకినాడలోని కీలక వైసీపీ నేత తన అనుచరుల ద్వారా విక్రయించి సంపాదించిన కోట్లకు లెక్కేలేదు. అప్పటి సర్కారులో ముఖ్య నేతకు అతి సన్నిహితమైన వ్యక్తి కావడంతో ఏ ఒక్కరూ కన్నెత్తి చూడలేదు. పేదల ఇళ్ల స్థలాల చదును ముసుగులో అప్పటి తన సామాజిక వర్గ కలెక్టర్ సహకారంతో సదరు కీలక నేత అనుమతులు తీసుకుని ఇక్కడున్న కొండలు, గుట్టలను ఖాళీ చేసి వందల కోట్లకు పడగలెత్తారు. గనులశాఖ అధికారులంతా ఐదేళ్లపాటు అడ్డుకోకపోవడంతో పెద్దపెద్ద కొండలన్నీ కరిగిపోయాయి. 823 ఎకరాల మెట్టంతా మింగేసి సగానికి పైగా భూములను సదరు వైసీపీ అక్రమార్కులు లోయలుగా మార్చేసినా జిల్లా గనుల శాఖ మౌనమే వహించింది. కొన్ని భూములను ప్రభుత్వం స్థానిక ఎస్సీ రైతుల సాగు కోసం అసైన్డ్ భూముల కింద కేటాయించింది. వీటిని ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున చెల్లించి ఇరవై అడుగుల లోతుకు మట్టి, గ్రావెల్ తరలించుకుపోయారు. వందల ఎకరాల అసైన్డ్ భూములను లీజుకు తీసుకుని లోయలుగా మార్చేసినా రెవెన్యూశాఖ సైతం కన్నెత్తి చూడలేదు. ఈ రెండు శాఖలు ఉమ్మడిగా సర్వే చేసి తవ్వి తరలించుకుపోయిన కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి సంగతి తేల్చుతామని ప్రగల్భాలు పలికి సర్వే జోలికి వెళ్లలేదు. కరెంటు స్తంభాలైతే అడుగు నుంచీ గాల్లో వేలాడుతున్నాయి. ఇక్కడ నుంచి తరలిపోయిన కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టికి గనులశాఖకు రూ.250 కోట్లకుపైనే రాయల్టీకి గండిపడింది. అయినా జరిమానా విధించే సాహసం చేయడం లేదు. అక్రమ తవ్వకాలపై స్పందనలో ఫిర్యాదులు చేసినా అవన్నీ బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుతం ఎన్‌జీటీని ఆశ్రయించడంతో కదలిక వచ్చింది.

ఎన్‌జీటీ విచారణకు ఆమోదం

రామేశ్వరం మెట్ట అక్రమాలపై రెండేళ్ల కిందట పెద్దాపురానికి చెందిన ఓ వ్యక్తి లోకాయుక్తను ఆశ్రయించినా నీరుగార్చేశారు. మళ్లీ ఇప్పుడు పెద్దాపురానికి చెందిన కర్రి వెంకట రమణ తాజాగా చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. మెట్టలో వందల కోట్ల అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ చేయించాలని ఆధారాలతో సహా పిటిషన్‌లో కోరారు. దీనిపై స్పందించిన ఎన్‌జీటీ కేసును ఎట్టకేలకు విచారణకు స్వీకరించింది. ఈ మేరకు మార్చి 19న కేసును రిజిస్టర్ చేసింది. దీంతో అక్రమార్కులకు ఉచ్చు బిగుసుకోనుంది. మెట్ట అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమిస్తే వందల కోట్ల కుంభకోణం బట్టబయలు కానుంది. అక్రమార్కుల నుంచి కళ్లప్పగించి చూసిన గనులు, రెవెన్యూ శాఖలు ఇరుక్కోనున్నాయి. మరోపక్క మెట్టలో అసైన్డ్ భూమాఫియా, అటవీ చట్టాల ఉల్లంఘన తదితర అంశాలపైనా పిటిషనర్ ఫిర్యాదు చేయడంతో ఎన్జీటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది. అయితే కాకినాడ నగరంలో పేదల ఇళ్ల స్థలాల పేరుతో మడ భూములను చదును చేసేసిన కేసులో ఇప్పటికే ఎన్జీటీ బాధ్యులైన అధికారులకు చుక్కలు చూపించింది. కోట్లలో జరిమానా కూడా విధించింది. ఈనేపథ్యంలో మెట్ట అక్రమాలపైనా ఎన్‌జీటీ ఉక్కుపాదం మోపాల్సి ఉంది.

823 ఎకరాల్లో.. మింగేశారు!

పెద్దాపురం, గండేపల్లి మండలాల్లో 823 ఎకరాల్లో కొండలు, గుట్టలు విస్తరించి ఉన్నాయి. సర్వే నెంబరు 1 నుంచి 90 వరకు ఉన్న ఈ ప్రాంతాన్ని రామేశ్వరం మెట్టగా పిలుస్తారు. మధ్యలో కొంత ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ కూడా ఉంది. ఇందులో జింకలు, దుప్పిలు, లేళ్ల ఇతర వన్యప్రాణులెన్నో ఉన్నాయి. కాకినాడకు సమీపంలో ఉన్న ఈ కొండలు, గుట్టల్లో నిక్షిప్తమై ఉన్న గ్రావెల్‌పై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ వైసీపీ కీలక నేత ద్వారంపూడి కన్ను పడింది. అంతే రామేశం మెట్టను గుల్ల చేసేశారు. 823 ఎకరాల్లో కొండలను మింగేసి మట్టిగ్రావెల్ కోసం కొండల కింద భూమిని సైతం లోయలుగా మార్చేశారు. అప్పటి కాకినాడ వైసీపీ కీలక నేత ద్వారంపూడి, ఆయన మనుషులు సాగించిన దోపిడీ పర్వం విలువ వందల కోట్లుపైనే. అయితే అప్పట్లో సదరు నేతకు భయపడి కలెక్టర్ నుంచి జేసీ వరకు గనుల శాఖ నుంచి రెవెన్యూ శాఖ వరకు అన్నీ సాగిలపడ్డాయి. ఎంత తవ్వుకున్నా కన్నెత్తి చూడ్డానికి భయపడ్డాయి. ఇప్పుడు ఎన్జీటీ కేసు విచారణకు స్వీకరించడంతో వేల కోట్ల కుంభకోణం బట్టబయలయ్యే అవకాశం కనిపిస్తోంది.

బకాయిలు చెల్లించకపోతే

7 నుంచి వైద్యం బంద్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు సుమారు రూ.3,500 కోట్ల బకాయిలు చెల్లించకపోతే ఏప్రిల్ 7వ తేదీ నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ పథకం వైద్యసేవలను పూర్తిగా నిలిపివేస్తామని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ (ఆషా) ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కురుకూరి విజయకుమార్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అరుణ్ తదితరులు కలెక్టర్ ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఉద్యమ కార్యాచరణలో భాగంగా శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. 30వ తేదీన జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. అప్పటికీ స్పందన లేకపోతే ఏప్రిల్ 7 నుంచి వైద్యసేవలను నిలిపివేయాలని నిర్ణయించామన్నారు.

కలిసిమెలిసి..

జిల్లా ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఆనందం వ్యక్తం చేసిన ముస్లింలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ఇచ్చే గొప్ప పిలుపు దాతృత్వమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో శుక్రవారం సాయంత్రం జిల్లా స్థాయి ఇఫ్తార్ విందు ఇచ్చారు. తొలుత ముస్లిం పెద్దలు నమాజ్ చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వ పక్షాన కలెక్టర్ ఇఫ్తార్ విం దు ఇచ్చారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ దైవంపై నమ్మకం కలుగచేసే గొప్ప గ్రంథం ఖురాన్ అన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదన్నారు.నగరంలో నెల రోజులుగా ప్రతి మసీదు ఇఫ్తార్‌లో పాల్గొనడం జరిగిందన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ మతం అనేది విశ్వాసం , నమ్మకం అన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ సహనానికి, తోటివారికి తనకున్నదాన్ని పంచడం అనే గొప్పసందేశం ఇచ్చే రంజాన్ మాసం స్ఫూర్తి కలిగిస్తోందన్నారు. ఎస్పీ నరసింహకిశోర్ మాట్లాడుతూ అజ్మీర్ దర్గా వద్ద జరిగే కార్యక్రమంలో సుమారు 70 నుంచి 80 వేల మంది పాల్గొన్నా ఒక్క కానిస్టేబుల్ కూడా లేకుండా క్రమశిక్షణ కలిగిన తీరును ప్రదర్శించడం ఎంతో స్ఫూర్తి ఇచ్చిందన్నారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందును స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో టి.సీతారామమూర్తి, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్,ఎండీ అబ్దుల్లా, ఎస్‌కె.అమీర్‌రాజా, బషీర్ భాయ్, మహబూబ్ ఖాన్, మహబూబ్ జానీ, బాషా ఖాన్, జానీ భాయ్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ,నగర అధ్యక్షుడు వై.శ్రీను, నక్క చిట్టిబాబు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి
చిత్రంలో ఎస్పీ నరసింహకిశోర్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ

ఐదు ఏఎంసీలకు చైర్మన్లు

కాకినాడ/అమలాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల జాబితాలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సంబంధించిన చైర్మన్లు చోటుదక్కించుకున్నారు. ఇందులో రెండు టీడీపీకి, మూడు జనసేనకు దక్కాయి. పిఠాపురం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా వాకపల్లి దేవి (జనసేన) నియమితులయ్యారు. ఈమె ఎస్సీ మహిళ కేటగిరీ నుంచి ఎంపికైంది. కాకినాడ రూరల్‌లోని కరప ఏఎంసీ చైర్మన్‌గా ముద్రగడ రమేష్ (జనసేన), కాకినాడ జిల్లా జగ్గంపేట ఏఎంసీ చైర్మన్‌గా అడపా భరత్‌బాబు (టీడీపీ) నియమితులయ్యారు.కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పరిధిలో నగరం ఏఎంసీ చైర్మన్‌గా పెనుమాల లక్ష్మి (జనసేన),మండపేట ఏఎంసీ చైర్మన్‌గా చింతపల్లి రామకృష్ణ (టీడీపీ) నియమితులయ్యారు.తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎవ రినీ ప్రకటించలేదు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కొవ్వూరు, మార్చి 28 (ఆంధ్ర జ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కొవ్వూరు డిపో ఎన్ఎంయూ సెక్రటరీ ఎం. శివకుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు శుక్రవారం గేటు మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. 1/19 సర్క్యులర్‌ను వెంటనే అమలుచేయాలని కోరారు. డిపోలో వన్‌మేన్ సర్వీసులపై నిరసన తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో డిపో చైర్మన్ సీహెచ్ రమణ, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ శివ, పీ. కృష్ణమోహన్, జాయింట్ సెక్రటరీ రవి, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


పట్టణంలో ఊరేగింపుగా గోదావరి నదికి వెళుతున్న భక్తులు

కొవ్వూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బసివిరెడ్డిపేటలో వేంచేసియున్న శ్రీరాజ్యలక్ష్మీ గోదా సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా శుక్రవారంతో ముగిశాయి. ఆలయ అర్చకుడు గొడవర్తి వేణుగోపాలచార్యులు పర్యవేక్షణలో ఆలయకమిటీ చైర్మన్ దేవగుప్తాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. తర్వాత ఉత్సవమూర్తులతో ఊరేగింపుగా గోష్పాదక్షేత్రం చేరుకుని గోదావరి నదిలో చక్రస్నాన ఘట్టాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. సాయంత్రం శ్రీరాజ్యలక్ష్మీ గోదాసమేత స్వామి వారక్లు ద్వాదశ ఆరాధన, పుష్పయాగం, ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, వేద పండితులు, పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్య, డాక్టర్ హారికాగుప్త

తాళ్లపూడి, మార్చి28 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు వేసవి ఉష్ణోగ్రతలు అధికమవుతున్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్య తెలిపారు. శుక్రవారం తాళ్లపూడి పీహెచ్‌సీకి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతలు ఎండల సమయంలో బయటకు రాకూడదన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ హారికా గుప్త పాల్గొన్నారు.

అందుబాటులోకి ఫాగింగ్ మిషన్లు

తాళ్లపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీలకు చెందిన ఫాగింగ్ మిషన్లకు మోక్షం కలిగింది. సాంకేతిక లోపంతో పక్కన పడవేసిన ఈ మిషన్ల మరమ్మతులకు గుంటూరు కంపెనీ నుంచి మెకానిక్‌లను శుక్రవారం రప్పించారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ వీర హరిబాబు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ దోమల నివారణకు మార్గం లేదని, ఫాగింగ్ మిషన్లన్నీ మూలనపడ్డాయని ఆరోపించిన నేపథ్యంలో ఎంపీడీవో ఆదేశాలతో ఈవోపీఆర్‌డి వీరన్న దృష్టిసారించి తాళ్లపూడి పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న వీటికి మరమ్మతులు చేయిస్తున్నారు.

పీడీఎస్ బియ్యానికి వేలంపాట

గోపాలపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్ఎల్ఎస్ పాయింట్ వద్ద 47 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యానికి శుక్రవారం వేలంపాట నిర్వహించినట్టు టీఎస్‌వో నాగాంజనేయులు తెలిపారు. ఈ బియ్యానికి రూ. 25 ధరను ప్రభుత్వం నిర్ణయించగా, ఇద్దరు వేలంలో పాల్గొన్నారన్నారు. నల్లజర్లకు చెందిన వినాయక ట్రేడర్స్ రూ.25.25 పైసలకు హెచ్చు పాటతో 47 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని వేలంలో దక్కించుకున్నట్టు టీఎస్‌వో చెప్పారు. అధిక ధర కారణంగా గతంలో రెండుసార్లు వేలం నిలిచిన సంగతి తెలిసిందే..

2 నుంచి రుణాలకు ఇంటర్వ్యూలు

చాగల్లు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 2 నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తెలిపారు. 2న బ్రాహ్మణగూడెం, చంద్రవరం, మల్లవరం, దారవరం, గౌరిపల్లి, చిక్కాల గ్రామాలకు, 3న తూదీప కలవలపల్లి, మార్కొండపాడు, నందిగంపాడు, ఎస్.ముప్పవరం, ఊనగట్ల గ్రామాలకు, 4న చాగల్లు, నెలటూరు గ్రామాలకు జరుగుతాయన్నారు.

పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


ప్రక్కిలంకలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలను ఆదుకోవడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో పలుగ్రామాలకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 2 లక్షల 52 వేల 666 చెక్కులను కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వేగేశ్వరపురంలో లబ్ధిదారుల నివాసాల వద్ద చెక్కుల పంపిణీ సమయంలో కొందరు మహిళలు తాగునీరు సరఫరా చేయటం లేదని తెలుపగా వెంటనే కార్యదర్శికి చరవాణిలో మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయిలు మంజూరుకు ఎస్టిమేషన్ వేసి పంపాలని తెలిపారు. అనంతరం ప్రక్కిలంక, వేగేశ్వరపురం, బల్లిపాడు, పెద్దేవం, తిరుగుడుమెట్టలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, బీజేపీ మండలా ధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, జనసేన మండ లాధ్యక్షుడు గంటా కృష్ణ, బూసి బెనర్జీ, కొప్పాక కొల్లీన్స్, నాయుడు హనుమంతరావు కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు



డాక్టర్ స్వరూపను సత్కరిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్

కొవ్వూరు, మార్చి 28 (ఆంధ్ర జ్యోతి): మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ ఇళ్లంతా ఆరోగ్యంగా ఉంటుందని ఏబీఎన్,పీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామ్మోహన్ అన్నారు. అవంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులకు మహిళల ఆరోగ్యాన్ని శక్తి వంతం చేయడం, ఋతుపరిశుభ్రత, హెచ్‌పీవీ టీకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు జి. స్వరూప ఆడవారిలో వచ్చే ఆరోగ్య సమస్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వరూపను మెమొంటోతో ప్రిన్సిపాల్ సత్కరించారు. కార్యక్రమంలో అవంతి ఫౌండేషన్ ప్రతినిధి ఏఎఫ్ ప్రశాంత్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. రమేష్, ఏ. అనూష, ఏ.రాణి, పీ.జ్యోతి, కె.కాంతమ్మ, మహిళా అధ్యాపకులు, డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణగూడెంలో గీతాపారాయణం


నాగారమ్మ ఆలయంలో పారాయణం చేస్తున్న భక్తులు

చాగల్లు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మ వారి ఆలయంలో శుక్రవారం గీతాపారాయణం చేశారు. గ్రామానికి చెందిన పత్తిపాటి కృష్ణమూర్తి, గారపాటి బలరామూర్తి ఆధ్వర్యంలో మహిళా భక్తులు పాల్గొని 108 పారాయణాలు పూర్తిచేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణమూర్తి, బలరామూర్తిను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

దళ్వా పంట కోతలు ప్రారంభం

నల్లజర్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దళ్వా సాగులో రైతులకు ఎకరానికి 53 బస్తాలు దిగుబడి వచ్చిందని ఏవో కమల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ప్రకాశరావుపాలెంలో వరి పంట కోతను పరిశీలించి, ఆయన మాట్లాడుతూ రైతులు గింజ పూర్తిగా ఎండే వరకు పంటపై ఉంచరాదని, తేమశాతం ఉన్నప్పుడే కోత ప్రారంభించాలన్నారు.

లోకేశ్‌కు ఎందుకు తప్పుడు సమాచారం ఇచ్చారు?

● ప్రవీణ్ పగడాల కేసులో వాస్తవాలు బయటపెట్టండి
● కేసులో నిర్లక్ష్యం వహించిన పోలీసులను సస్పెండ్ చేయాలి
● కొవ్వూరులో మహాసేన రాజేష్ డిమాండ్


సిట్ అధికారి దేవకుమార్‌కి వినతిపత్రం అందజేస్తున్న రాజేష్ మహాసేన, కూటమి నాయకులు

కొవ్వూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌కు పాస్టర్ ప్రవీణ్ పగడాలది యాక్సిడెంట్ అని సమాచారం ఇచ్చిన సీఐ, పోలీసులను సస్పెండ్ చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజేష్ మహాసేన డిమాండ్ చేశారు. కొవ్వూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ ప్రెస్‌మీట్‌లో ఇది యాక్సిడెంట్ అని నిర్ణయించలేదు అనుమానాస్పద మృతిగా విచారణ చేస్తున్నామన్నారు. అయితే దీనిపై మంత్రి లోకేశ్, మాకు ఎందుకు చెప్పలేదన్నారు. దీంతో పోలీసులు చెప్పిన విధంగా ప్రాథమిక విచారణ అనంతరం మంత్రి లోకేశ్ ప్రవీణ్ పగడాలది యాక్సిడెంట్ అని ట్వీట్ చేశారన్నారు. దీంతో ప్రతి ఒక్కరూ విమర్శిస్తున్నారన్నారు. పోలీసులు డబుల్ గేమ్ ఆడుతున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్దేశపూర్వకంగా చెడ్డపేరు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారా అని పోలీసు అధికారులను ప్రశ్నించారు. యాక్సిడెంట్ అయితే ఇప్పటి వరకు ఎందుకు ఆధారాలు చూపించలేదన్నారు. గన్నవరం వద్దే హెడ్‌లైట్ కాకుండా బ్లింకర్ల మీద వస్తున్నారని అధికారులు చెబుతున్నారు. ఆ ఫుటేజ్ ఎందుకు విడుదల చేయరన్నారు. కేసుకు సంబంధించిన వాస్తవాలను శనివారం సాయంత్రమే తెలియజేయాలన్నారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మహాసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, వి.పృథ్వీరాజ్, వై. రవీంద్ర, వై.రాము, మోకా మణిరాజ్, ఆనంద్, అబి తాడి, జెస్సీ, రామకృష్ణ, బాలు, తదితరులు ఉన్నారు.

'యూట్యూబ్‌ల్లో మతపరమైన డిబేట్లు వద్దు'

తెలుగు రాష్ట్రాల్లో యూట్యూబ్ ఛానల్స్ ద్వారా నిర్వహిస్తున్న మతపరమైన డిబేట్లకు, ఇతర మతాలను దూషించే ప్రసారాలకు అడ్డుకట్ట వేయాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పాస్టర్ మోసా అబ్రహం అన్నారు. కొవ్వూరు డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీ జీ. దేవకుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

వారపుసంత, షాపింగ్ కాంప్లెక్స్‌కు బహిరంగ వేలం

గోపాలపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం గ్రామ పంచాయతీలోని వారపు సంత, షాపింగ్‌కాంప్లెక్స్‌కు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించినట్టు పంచాయతీ కార్యదర్శి అనురాధ తెలిపారు. గ్రామానికి చెందిన శ్యామల కృష్ణారెడ్డి రూ. రెండు లక్షల 70 వేలకు పాట దక్కించుకున్నారు. అలాగే జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న ఎనిమిది షాపులకు గత ఏడాది నెలకు రూ.2800 వేలంలో పాటను దక్కించుకోగా, ఈ ఏడాది ఒక్కో షాపునకు నెలకు రూ. 3200 హెచ్చుపాట పలికింది.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● తహశీల్దార్ అజయ్‌బాబు

గోపాలపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ అజయ్‌బాబు ఒకప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఎండల తీవ్రతతో పాటు వడగాల్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించినట్టు ఆయన చెప్పారు. ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్పితే బయటకు రావొద్దన్నారు. ఒకవేళ వచ్చినట్టయితే గొడుగులు, టోపీలు ఉపయోగించుకోవాలన్నారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి తీసుకోవాలన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు


దేవరపల్లిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. లక్ష్మీపురం, రామన్నపాలెం, పల్లంట్ల, సంగాయిగూడెం, త్యాజంపూడి, యాదవోలు, యర్నగూడెం గ్రామ పంచాయతీలకు చెందిన దరఖాస్తుదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఇంటర్వ్యూకు 350 మందికి సమాచారం ఇచ్చామని తెలిపారు. అలాగే 29న కురుకూరు, కృష్ణంపాలెం, ధూమంతనగూడెం, గౌరీపట్నం, చిన్నాయిగూడెం, దేవరపల్లికి చెందిన 621 మందికి ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

రుణాలు పొందేందుకు ప్రణాళికలు సిద్ధంచేయాలి


సమావేశానికి హాజరైన ఎన్యుమరేటర్లు, వీవోలు

ఉండ్రాజవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు తయారుచేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సంపత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక డ్వాక్రా భవనంలో స్వయంసహాయక సంఘాల ఎన్యుమరేటర్లు, వీవోలకు జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 2025-2-26 సంవత్సరానికి డ్వాక్రా గ్రూపు సభ్యులకు వారి అవసరాల నిమిత్తం రుణాలు పొందేలా ప్రనాళికలు రూపొందిచాలని ఆయన సూచించారు. ఇకనుంచి జియోట్యాగింగ్ చేసిన స్థలాల్లో మాత్రమే డ్వాక్రా గ్రూపు సభ్యులు, వీవోల సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు చెల్లింకి సౌభాగ్య లక్ష్మి, ఏపీఎం టి. బాలకోటయ్య, సీపీలు నాగమణి, ఏ. సుబ్బారావు, వీవోలు, తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి మాసశివరాత్రి పూజలు


నిడదవోలు పట్టణంలో విశేష పూజలందుకున్న స్వామివారు

నిడదవోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసివున్న బాలా త్రిపుర సుందరి సహిత సోమేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో శుక్రవారం దివ్య కల్యాణ మహోత్సవాలలో జరుగుతున్న పూజలతో పాటు మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, అభిషేకాలు, లక్షబిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు లలితా సహస్రనామం జరిగాయి. ఆలయప్రధాన అర్చకుడు శ్రీకాకోళపు లక్ష్మీ నరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో సోమాల శివ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రాజెక్టులపై సీఎం సానుకూల నిర్ణయం

● అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి దిశానిర్దేశం

రాజమహేంద్రవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విజన్ 2047 లక్ష్య సాధన కోసం మనం జిల్లాలో ప్రతిపాదించిన ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఇక మనం నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి మండలస్థాయిలో ప్రణాళికలను సమర్థవంతంగా అమలుకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి దిశానిర్దేశం చేశారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె పాల్గొని వివరించారు. వ్యవసాయ, హార్టీకల్చర్, పశు సంవర్ధక, మత్స్యశాఖ, అధికారులు జీవీఏ వృద్ధి రేటు పెంచేలా తయారు చేసిన నివేది కలను సమర్థవంతంగా అమలుచేయాలన్నారు. దీనికోసం క్షేత్రస్థాయిలో ప్రణాళికలను ఆచరించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు పెంచే దిశలో పంటల మార్పిడి, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగు, పొలాలగట్లపై అంతర పంటలు, పశువుల దాణా, గడ్డి సాగువంటివాటిపై దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, జిల్లా రెవిన్యూ అధికారి టి. సీతారామ్మూర్తి, ఆర్డీఓలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, సిపిఓ ఎల్. అప్పలకొండ, డీఏఓ ఎస్. మాధవావు, ఎపి ఎంఐపి పిడి ఎ.దుర్గేష్, జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి కె.విజయకుమారి, డీఆర్‌డిఏ పీడీ ఎన్వీవిఎస్ మూర్తి, డీఎహెచ్‌ఓ ఏ. శ్రీనివాసరావు, డిఐఓ శ్రీమనిధర్ రామన్,పర్యాటక అధికారి పి. వెంకటాచలం, జిల్లా హార్టీకల్చర్ అధికారి బి. సుజాత కుమారి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ బివిగిరి, డ్వామా పీడీ ఎం. నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగమురళి


కొవ్వూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కొవ్వూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వర్రే నాగమురళి ఎన్నికయ్యారు. శుక్రవారం కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. మొత్తం 227 ఓట్లు ఉండగా, ఇందులో 208 మంది న్యాయవాదులు మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా వర్రే నాగమురళి, ఉపాధ్యక్షుడిగా ముంగమూరి నాగమణి, జనరల్ సెక్రటరీగా రాజాన వీర వెంకట సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా పీతల ఆనంద గెరట బాబు, ట్రెజరర్‌గా రవీంద్ర, స్పోర్ట్స్ సెక్రటరీగా జె. భరత్‌చంద్ర ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఏలూరి గోపాలకృష్ణ, తాడేపల్లి ప్రభాకరరావు, ఎండీవీ ప్రభాకర్ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు అభినందించారు.

'పది' పరీక్షకు 21 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలో శుక్రవారం జరిగిన పదోతరగతి బయలాజికల్ సైన్సు పరీక్షకు 21 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 10 పరీక్షా కేంద్రాలలో 1275 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1254 మంది హాజరయ్యారు. అలాగే మున్సిపల్ హైస్కూల్లో 76 కి 70, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (గవర్నమెంట్ హైస్కూల్) 134కి 134, ఏఎస్‌జడ్పీ గర్ల్స్ హైస్కూల్లో 109 కి 108, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్లో 95కి 93, అభ్యాస పాఠశాలలో 130 కి 130, వేములూరు దీప్తి హైస్కూల్లో 148 మందికి 143, బాష్యం పాఠశాలలో 144 కి 139, జడ్పీహెచ్‌ఎస్, కుమారదేవంలో 118 కి 118, జడ్పీహెచ్‌ఎస్, వాడపల్లిలో 213కి 212, జడ్పీహెచ్‌ఎస్, పంగిడిలో 108కి 107 మంది విద్యార్థులు హాజరయ్యారు.

చాగల్లు: మండలంలో శుక్రవారం జరిగిన పదోతరగతి బయోలాజికల్ సైన్సు పరిక్షకు ఏడుగురు గైర్హాజరైనట్టు ఎంఈవో యూ. గురునాథం తెలిపారు. పాత సిలబస్‌కు సంబంధించి పది మందికి గాను ఒకరు గైర్హాజరు కాగా, 9 మంది పరీక్షకు హాజరయ్యారు. కొత్త సిలబస్‌కు సంబంధించి 374 మందికి గాను ఆరుగురు గైర్హాజరుకాగా, 368 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

వైసీపీ నేత గూడూరి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



పట్టణంలోని వాత్సల్య వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న వైసీపీ నేతలు, తదితరులు

కొవ్వూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాత్సల్య వృద్ధాశ్రమంలో శుక్రవారం వైసీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంటమణి రమేష్ బాబు, పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వల్లభశెట్టి శ్రీనివాస్, చొప్ప అప్పలనాయుడు, అలీ, మద్దిపట్ల దొరబాబు, మాసా ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.